
Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్




IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 96 | ఆదివారం 07 సెప్టెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## గుజరాత్ శక్తిపీఠంలో
# తెగిన రోప్‌వే...

- ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి
- సరకు రవాణా రోప్‌వే తీగ తెగిపోవడంతో ఘటన
- మృతుల్లో ఇద్దరు లిఫ్ట్‌మెన్లు, ఇద్దరు కార్మికులు

**గుజరాత్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06**

గుజరాత్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పంచమహల్ జిల్లా పావగఢ్ శక్తిపీఠంలో పెను విషాదం చోటుచేసుకుంది. సరకు రవాణాకు వినియోగించే కార్గో రోప్‌వే తీగ అకస్మాత్తుగా తెగడంతో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆలయ పరిసరాల్లో తీవ్ర కలకలం రేగింది.

వివరాల్లోకి వెళితే, ఈ మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. పావగఢ్ కొండపైకి వస్తువులను చేరవేసేందుకు ఉపయోగించే కార్గో రోప్‌వే కేబుల్ ఒక్కసారిగా తెగిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు లిఫ్ట్‌మన్లు, ఇద్దరు కార్మికులతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు మరణించినట్లు పంచమహల్ జిల్లా ఎస్పీ హరీశ్ దుధత్

- మిగతా 2లో..

## ట్రంప్ స్నేహభావానికి
# మేం కట్టుబడి ఉన్నాం

- తనను 'ఫ్రెండ్' అంటూ ట్రంప్ పేర్కొనడంపై మోదీ స్పందన
- మోదీ తనకు మంచి స్నేహితుడని చెప్పిన అమెరికా అధ్యక్షుడు

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం స్పందించారు. ట్రంప్ స్నేహపూర్వక భావనలను తాను పూర్తిగా గౌరవిస్తానని, వాటికి కట్టుబడి ఉంటానని మోదీ స్పష్టం చేశారు. ఇటీవల భారత్-అమెరికా మధ్య వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, ఇరు దేశాల అధినేతల మధ్య ఈ ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది.

- మిగతా 2లో..

## మోదీ-ట్రంప్ బంధం
# చాలా ప్రత్యేకం

- కేంద్ర మంత్రి జైశంకర్
- అమెరికాతో భాగస్వామ్యానికి ప్రధాని అధిక ప్రాధాన్యం
- ఇటీవల మోదీని 'మిత్రుడు' అని పొగిడిన ట్రంప్
- వాణిజ్య ఉద్రిక్తతల నడుమ ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యం
- భారత దిగుమతులపై అమెరికా 50 శాతం టారిఫ్‌ల విధింపు



**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06**

భారత్-అమెరికా మధ్య వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ, ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య వ్యక్తిగత సంబంధాలు బలంగా ఉన్నాయని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.

- మిగతా 2లో..

# సవ్యంగా ఎరువుల సరఫరా

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అందుబాటులో 77 వేల టన్నులు
- రబీకి వెబ్‌ల్యాండ్, ఇ-పంట ఆధారంగా ఎరువులు



**అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06**

రాష్ట్రంలో ఎరువుల సరఫరా సక్రమంగా జరుగుతోందని, రైతులకు డిమాండు మేరకు అందుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎరువుల లభ్యత, సరఫరా అంశంపై జిల్లాల కలెక్టర్లు, ఎస్పిలు, వ్యవసాయశాఖ అధికారులతో సిఎం శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎరువుల సరఫరాపై ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సమీక్ష నిర్వహించారు. అధికారులు ఇచ్చే సమాచారంతోపాటు ఆయా జిల్లాల నుంచి తెప్పించుకున్న సమాచారాన్ని పోల్చి ఎంత స్థాయిలో అందుబాటులో ఉన్నాయో వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 77,396 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. మరో 10 రోజుల్లో 41 వేల టన్నుల ఎరువులు రాష్ట్రానికి

- మిగతా 2లో..




# రైతు సమస్యలపై ప్రభుత్వం మొద్దునిద్ర

- 9న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు
- పోస్టర్ ఆవిష్కరణలో సజ్జల

**అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06**

రైతు సమస్యలపై కూటమి సర్కారు మొద్దునిద్ర పోతోందని, నిరసనగా ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడం ద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపించాలని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైసిసి ఆధ్వర్యాన చేపట్టనున్న అన్నదాత పోరు పోస్టర్‌ను శనివారం తాడేపల్లి వైసిపి కార్యాలయంలో సజ్జల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి నేతల కనుసన్నల్లోనే

- మిగతా 2లో..



## భారతదేశానికి మంచి
# ప్రతిపక్షం అవసరం

- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06**

భారతదేశానికి మంచి ప్రతిపక్ష పార్టీ, మంచి ప్రతిపక్ష నాయకులు అవసరమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం అన్నారు. 2017లో ఏకీకృత పరోక్ష పన్ను వ్యవస్థను ప్రవేశపెట్టడానికి ముందు జీఎస్టీ సంస్కరణలపై మోడీ ప్రభుత్వం చేసిన విమర్శలను ఆమె "అజ్ఞానం" మరియు "వాస్తవానికి సంబంధం లేనిది" అని విమర్శించారు. పీటీఐతో మాట్లాడుతూ, జీఎస్టీ ప్రవేశపెట్టినప్పుడు నాలుగు పన్ను శ్లాబులను నిలుపుకున్నందుకు భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నిందించడంపై, ఇటీవల

- మిగతా 2లో..

## చదువుతో పాటు
# విదేశీ భాషల్లో శిక్షణ

- సీడాప్‌తో 50వేల మందికి విదేశీ ఉద్యోగాలు
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

**అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06**



చదువుతో పాటు విదేశీ భాషల్లో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవపల్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్(సీడాప్), ఇండో యూరో సింక్రనైజేషన్ అండ్ జర్మన్ హెల్త్ కేర్ సంయుక్త భాగస్వామ్యంతో అంతర్జాతీయ ప్లేస్‌మెంట్ పథకం కింద జర్మనీలో 14 మంది నర్సింగ్, హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్‌కు కాల్ లెటర్స్ అందాయి. ఈ విద్యార్థులు మంత్రి లోకేష్‌ను ఉండవల్లిలో శనివారం కలిశారు. తొలిబ్యాచ్ కింద సీడాప్ ద్వారా 171 మందికి శిక్షణ ఇవ్వగా ఇప్పటికే 40 మంది ఎంపికయ్యారని తెలిపారు. అంతర్జాతీయస్థాయి ఉద్యోగ అవకాశాలను రాష్ట్ర యువత అందిపుచ్చుకోవాలన్నదే

- మిగతా 2లో..



## ఎంపి మిథున్‌రెడ్డికి
# మధ్యంతర బెయిల్

- 11న లొంగిపోవాలని షరతు
- మరో ముగ్గురికి బెయిల్

**అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06**

మద్యం కేసులో నలుగురు నిందితులకు స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో ఇప్పటి వరకు 12 మందిని సిట్ అధికారులు అరెస్టు చేయగా వారిలో నలుగురికి బెయిల్ శనివారం వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జైలులో రిమాండ్ ఖైదీగా ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ట్రంప్ స్నేహభావానికి
# మేం కట్టుబడి ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

“అధ్యక్షుడు ట్రంప్ మా సంబంధాలపై చేసిన సానుకూల వ్యాఖ్యలను, ఆయన స్నేహభావనను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. వాటికి మేం పూర్తిగా కట్టుబడి ఉన్నాం. భారత్, అమెరికా మధ్య ఎంతో సానుకూలమైన, భవిష్యత్ ప్రణాళికలతో కూడిన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది” అని ప్రధాని మోదీ ‘ఎక్స్’ వేదికగా పేర్కొన్నారు.

అంతకుముందు శుక్రవారం డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ తనకు ఎప్పటికీ స్నేహితుడేనని, ఇరు దేశాల మధ్య చాలా ప్రత్యేకమైన బంధం ఉందని అన్నారు. అయితే, అదే సమయంలో భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. “మోదీ గొప్ప ప్రధానమంత్రి. మేం ఎప్పుడూ స్నేహితులమే. కానీ, ప్రస్తుత తరుణంలో ఆయన చేస్తున్న పని నాకు నచ్చడం లేదు. అయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మా మధ్య అప్పుడప్పుడు కొన్ని సమస్యలు వస్తుంటాయి” అని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్‌తో వాణిజ్య చర్చలు బాగానే సాగుతున్నాయని కూడా ఆయన తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా ఇటీవల ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై ద్వితీయ శ్రేణి టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ఈ కొత్త జాబితా ప్రకారం, బ్రెజిల్ తర్వాత భారత ఎగుమతులపైనే అమెరికా అత్యధికంగా 50 శాతానికి పైగా సుంకాలు విధించింది. అమెరికా చర్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది “అన్యాయమైన, అహేతుకమైన చర్య” అని పేర్కొంది.

ఈ పరిణామాల మధ్యే చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు. అక్కడ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లతో ఆయన ఎంతో స్నేహపూర్వకంగా కనిపించారు. పరస్పరం కరచాలనం చేసుకుని, ఆలింగనం చేసుకున్న చిత్రాలు, వీడియోలు ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యాయి. అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఇద్దరు నేతలతో మోదీ తన ఐక్యతను ప్రదర్శించారని విశ్లేషకులు భావిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం, “అమెరికా... భారత్‌ను చైనాకు కోల్పోయింది” అని ట్రంప్ విచారం వ్యక్తం చేశారు. అయితే, ఆ తర్వాత తన వ్యాఖ్యలను ఆయనే సరిదిద్దుకున్నారు. “భారత్ రష్యా నుంచి అంత పెద్ద మొత్తంలో చమురు కొనడం నన్ను నిరాశ పరిచింది. ఈ విషయాన్ని వాళ్లకు తెలియజేశాను. అందుకే భారీగా 50 శాతం టారిఫ్ విధించాం. ప్రధాని మోదీతో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి” అని మీడియాకు వివరణ ఇచ్చారు.

## మోదీ-ట్రంప్ బంధం
# చాలా ప్రత్యేకం

(మొదటి పేజీ తరువాయి)

ఇరు దేశాల మధ్య కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ, ఇరువురు అగ్రనేతల స్నేహబంధంపై ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ జైశంకర్ ఈ విషయంపై స్పందించారు. “అమెరికాతో మన భాగస్వామ్యానికి ప్రధాని మోదీ ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధానికి ఎప్పుడూ మంచి వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయి” అని ఆయన తెలిపారు. అమెరికాతో చర్చలు నిరంతరం కొనసాగుతాయని, ప్రస్తుతానికి ఇంతకంటే ఎక్కువ చెప్పలేనని జైశంకర్ పేర్కొన్నారు. ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని మోదీని ‘తన మిత్రుడు’, ‘గొప్ప ప్రధాని’ అని ప్రశంసించారు. దీనికి ప్రధాని మోదీ కూడా సానుకూలంగా స్పందించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే జైశంకర్ తాజా వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో పాటు ఇతర అంశాలను చూపుతూ, అమెరికా ఇటీవల భారత దిగుమతులపై 50 శాతం టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. అమెరికా చర్యను భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇది “అన్యాయమైనది, అహేతుకమైనది” అని వ్యాఖ్యానించింది.

# గుజరాత్ శక్తిపీఠంలో తెగిన రోప్‌వే...

(మొదటి పేజీ తరువాయి)

ధృవీకరించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మరోవైపు, ఉదయం నుంచి బలమైన గాలులు వీస్తుండటంతో ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్యాసింజర్ రోప్‌వే సేవలను ముందే నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం కేవలం సరకు రవాణా రోప్‌వేలో మాత్రమే జరిగిందని స్పష్టం చేశారు. సుమారు 800 మీటర్ల ఎత్తులో ఉన్న మహాకాళి అమ్మవారి శక్తిపీఠానికి ఏటా 25 లక్షల మంది భక్తులు వస్తుంటారు. ప్రమాద వార్త తెలియగానే భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సాంకేతిక కారణాలతోనే ఈ ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ తర్వాతే ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలుస్తాయని ఎస్పీ హరీశ్ దుథత్ వెల్లడించారు.

## భారతదేశానికి మంచి
# ప్రతిపక్షం అవసరం

(మొదటి పేజీ తరువాయి)

రెండు శ్లాబులను మాత్రమే ఉంచడం ద్వారా నిర్మాణాన్ని హేతుబద్ధీకరించే చర్యను సమర్థించడాన్ని నిర్మలా సీతారామన్ తీవ్రంగా విమర్శించారు. ఇది బిజెపి నిర్ణయం కాదని, అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కూడా వేర్వేరు పన్ను శ్లాబులను లేదా ఒక నిర్దిష్ట వస్తువుకు జిఎస్‌టి రేటు ఎంత ఉండాలో నిర్ణయించలేదని సీతారామన్ అన్నారు. కాంగ్రెస్ మంత్రులు కూడా ఇందులో భాగమేనని అన్నారు. “వాళ్ళు (విపక్షాలకు) దాని గురించి తెలియదా?” జూలై 2017లో అమలులోకి రాకముందు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు కీలక పాత్ర పోషించిన నాలుగు జిఎస్‌టి రేట్ల పరిణామాన్ని వివరించిన సీతారామన్, చెట్ల నరికివేత వంటి సమస్యలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం తరహాలో, దేశానికి మంచి ప్రతిపక్ష పార్టీ మరియు మంచి ప్రతిపక్ష నాయకుల కోసం ప్రచారం అవసరమని అభిప్రాయపడ్డారు.

## ఎంపి మిథున్‌రెడ్డికి
# మధ్యంతర బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

శనివారం విజయవాడ ఎసిబి కోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు వీలుగా కోర్టు అనుమతినిచ్చింది. తిరిగి ఈ నెల 11న సాయంత్రం 5 గంటలలోపు రాజమండ్రి సెంట్రల్ జైలులో సరెండర్ కావాలని ఎసిబి కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఎంపి మిథున్ రెడ్డి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. ఇదే కేసులో కీలక నిందితులుగా సిట్ భావిస్తున్న వారిలో ఎ-31 ధనంజరురెడ్డి, ఎ-32 కృష్ణమోహన్‌రెడ్డి, ఎ-33 బాలాజీ గోవిందప్పకు ఎసిబి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఒక్కొక్కరు రూ.లక్ష, రెండు పూచీకత్తులు చొప్పున ష్యూరిటీ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ ముగ్గురు నిందితులు విదేశాలకు వెళ్లకుండా వారి పాస్‌పోర్టులు అందించాలని పేర్కొంది.

# సవ్యంగా ఎరువుల సరఫరా

(మొదటి పేజీ తరువాయి)

అదనంగా రానున్నాయని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. బాపట్ల, కృష్ణా, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఎరువుల కొరత ఉందని, ఆ సమస్యను పరిష్కరించేందుకు ఇతర ప్రాంతాల నుంచి తెప్పిస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. సమస్యను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నుంచి జిల్లా కలెక్టరు వరకూ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎరువుల సరఫరాను పరిశీలించాలన్నారు. ఎరువుల లభ్యత గురించి రైతులకు వివరించి వాళ్లు ఎటువంటి ఇబ్బందీ పడకుండా చూడాలన్నారు. అందరికీ ఎరువులు అందుతాయనే భరోసాను రైతులకు కలిగించాలని చెప్పారు. వచ్చే రబీలో వెబ్‌ల్యాండ్, ఇ-పంట అనుసంధానంతో రైతుల ఆధార్ ఆధారంగా ఎరువుల సరఫరా చేపట్టాలని సిఎం తెలిపారు. దీనికోసం ఇప్పటి నుంచే సమాయత్తం కావాలన్నారు. ఎవరు ఎంత పంట వేస్తారో ఇ-పంట నమోదు ద్వారా చూసి వారికి అవసరమైన మేరకు ఎరువులు ఇచ్చే మెకానిజం తీసుకురావాలని అన్నారు. కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి బాధ్యత తీసుకుని రైతులకు ఎరువుల సరఫరాపై అవగాహన కల్పించడాన్ని ముఖ్యమంత్రి ప్రసంశించారు. అన్ని జిల్లాల్లో ఈ తరహా కార్యక్రమం చేపట్టి ఎరువులు సరఫరాలో ఉన్న అన్ని అనుమానాలనూ తొలగించాలన్నారు.

# రైతు సమస్యలపై ప్రభుత్వం మొద్దునిద్ర

(మొదటి పేజీ తరువాయి)

యూరియా బ్లాక్ మార్కెట్ దందా నడుస్తోందని ఆరోపించారు. అడిగిన రైతులను వేధిస్తోందని, రాష్ట్రంలో అన్ని పంటలకూ గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. రైతులతో కలిసి ఆందోళనలు నిర్వహించడం ద్వారా సర్కారు మెడలు వంచుతామని, వారికి న్యాయం జరిగే వరకూ ఊరుకునేది లేదని అన్నారు. 9న రాష్ట్రంలో ఉన్న అన్ని ఆర్‌డిఒ కేంద్రాల వద్ద నిరసన వ్యక్తం చేసిన అనంతరం వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించాలని, టమాట, ఉల్లి, చినీ, బప్పాయితోపాటు రైతులు పండించే అన్ని పంటలకూ మద్దతు ధర చెల్లించాలని కోరారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి మార్కెట్లో పోటీ పెంచాలన్నారు. ప్రైవేటు వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ఒప్పించి రైతులకు అండగా నిలవాలని కోరారు. యూరియా కోసం డిపోల వద్ద కిలోమీటర్ల దూరం క్యూలైన్లు ఏర్పాటవుతున్నాయని పేర్కొన్నారు. యూరియా ఇవ్వలేని ఉప ముఖ్యమంత్రి కేన్సర్ వస్తుందంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, రుహుల్లా, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ మంత్రి వెలంపల్లి, మాజీ ఎంపి నందిగం సురేష్, పార్టీ ఎస్‌సి సెల్ అధ్యక్షులు టిజెఆర్ సుధాకర్‌బాబు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పలువురు పాల్గన్నారు.

**వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు చంద్రబాబు పచ్చజెండా : విడదల రజిని**

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు సిఎం చంద్రబాబు పచ్చజెండా ఊపారని మాజీ మంత్రి విడదల రజిని విమర్శించారు. ఆరోగ్యశ్రీలో ఇన్సూరెన్స్ విధానానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఇది పూర్తిగా ప్రజావైద్య రంగాన్ని నిర్వీర్యం చేయడమేనని పేర్కొన్నారు. రూ.8,500 కోట్ల వ్యయంతో చేపట్టిన 17 కొత్త మెడికల్ కళాశాలల్లో ఐదు ప్రారంభమయ్యాయని వివరించారు. ఈ ఏడాది ప్రారంభానికి మరో ఐదు సిద్ధంగా ఉన్నాయని, వాటిని ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు.

## చదువుతో పాటు
# విదేశీ భాషల్లో శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

సిఎం గారి లక్ష్యమని చెప్పారు. జర్మనీ వెళ్తున్న 14 మంది 10 మందికి స్ఫూర్తిగా నిలవాలని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకునే విధంగా సీడాప్-ఓంక్యాప్ ద్వారా విదేశీ భాషల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ ప్రధాన హామీ ఐదేళ్లల్లో 20 లక్షల ఉద్యోగాల కల్పన అని తెలిపారు. ఈ లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. నైపుణ్యపోర్టల్‌ను ఈ నెలలోనే ప్రారంభించబోతున్నామని చెప్పారు. మహిళలను గౌరవించేల కెజి టు పిజి కరిక్యులమ్‌లో మార్పులు తేస్తున్నామని తెలిపారు. మహిళలను కించపరిచే సినిమాలను సైతం విడుదల కాకుండా అడ్డుకోవాలన్నదే తమ అభిమతమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ జి దీపక్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి గణేష్‌కుమార్, సీడాప్ సిఇవో పి నారాయణ స్వామి, స్కిల్ ఇంటర్నేషనల్ యాక్టివిటీస్ సలహాదారు సీతాశర్మ తదితరులు పాల్గన్నారు.

## ఇజ్రాయిల్ దాడులకు 50 మందికిపైగా
# పాలస్తీనియన్లు మృతి



గాజా - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06

వేలాది మంది పాలస్తీనియన్లు మృతి చెందినా ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఆపడం లేదు. తాజాగా గాజాపై శుక్రవారం జరిపిన దాడుల వల్ల ఏడుగురు చిన్నారులతో సహా 50 మందికిపైగా పాలస్తీనియన్లు మృతి చెందారు. అలాగే శనివారం తెల్లవారుజాము నుంచే ఇజ్రాయిల్ దాడులకు పాల్పడింది. ఉత్తర గాజాలోని పాలస్తీనియన్ల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది.

గాజా నగరంలో జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఒక ఎత్తైన భవనాన్ని ఇజ్రాయిల్ సైన్యం ధ్వంసం చేసింది.దీంతో అక్కడ కూడా నరక ద్వారాలు తెరుచుకున్నాయని ఇజ్రాయిల్ రక్షణశాఖా మంత్రి ఇటామర్ బెన్-గ్విర్ అన్నారు. శనివారం అల్ షిఫా ఆసుపత్రిపై జరిపిన దాడిలో ఒక చిన్నారుతో సహా ఐదుగురు మృతి చెందారు. అలాగే అల్ షుహాదా స్క్వేర్‌కు పశ్చిమాన ఉన్న శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ సైన్యం బాంబుదాడికి పాల్పడడంతో ఐదుగురు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. కాగా, అక్టోబర్ 7, 2023లో మొదలైన గాజాపై ఇజ్రాయిల్ దాడిలో అధికారిక లెక్కల ప్రకారం 64,300 మంది చనిపోయారు. 162,005 మంది గాయాలపాలయ్యారు.

## సమాజానికి మంచి సందేశాల
# వేదిక లఘు చిత్రాలు

### - యువతలో సృజనాత్మకత, కొత్త ఆలోచనలు
### - నాల్గో అంతర్జాతీయ లఘు చలనచిత్రాల పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి రామానాయుడు

పాలకొల్లు - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06



సమాజంలోని ప్రజలను చైతన్యపరిచి, రుగ్మతలను ఎత్తిచూపుతూ మంచి సందేశాలిచ్చే వేదికగా లఘు చలన చిత్రాలు నిలుస్తున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని శ్రీ రామచంద్ర మినీ గార్డెన్లో శనివారం జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నాలుగో అంతర్జాతీయ లఘు చలనచిత్ర పోటీల ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పోటీల్లో పలు లఘు చిత్రాలు అందర్నీ ఆకట్టుకోవడంతోపాటు ఆలోచింపజేశాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు మాజీ ఎంపి చేగొండి వెంకటహరిరామ జోగయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మట్లాడుతూ ప్రతిఒక్కరిలో సామాజిక బాధ్యతను గుర్తు చేయడంతోపాటు వినోదాన్ని లఘు చిత్రాలు అందిస్తున్నాయన్నారు. నిడివి తక్కువ గల లఘు చిత్రాలకు స్మార్ట్ ఫోన్లు వచ్చాక విపరీతమైన ఆదరణ పెరిగిందన్నారు. నేటి యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను, కొత్త ఆలోచనలను వెలికి తీసేందుకు లఘుచిత్రాలు దోహదపడుతున్నట్లు వివరించారు. ఈ చిత్రాల ద్వారా కొత్త దర్శకులు, నటీనటులు తమ ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. ఫిలింనగర్ కల్చరల్ సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరాజుకు విశేష సేవా భూషణ్ పురస్కారం, ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణకు విశేష ప్రతిభా పురస్కారాలను మంత్రి అందజేసి ఘనంగా సన్మానించారు. పరిషత్ జాతీయ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేశిరాజు రాంప్రసాద్ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు, రాజేంద్ర కుమార్, పెనుమత్స కోటి రామచంద్రరాజు తదితరులు మాట్లాడారు.

## జిఎస్‌టి కొత్తస్లాబులతో
# రాష్ట్రానికి మరింత ఆదాయం
### - నీలాయపాలెం విజయ్ కుమార్



**అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06** జిఎస్‌టి కొత్త స్లాబులతో రాష్ట్రానికి మరింత ఆదాయం వస్తుందని , ప్రజల కొనుగోలు శక్తి పెరిగేలా నూతన జిఎస్‌టి స్లాబులను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎపి బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ పేర్కొన్నారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన జిఎస్‌టి సంస్కరణలను కూటమి ప్రభుత్వం స్వాగతిస్తోందన్నారు. కొత్త స్లాబులతో వ్యవసాయ, వ్యాపార, రియల్ ఎస్టేట్ రంగాలకు భారీ ఊరట లభిస్తుందని, పౌల్ట్రీ, పాడి పరిశ్రమల అభివృద్ధికి మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

# సంపాదకీయం

## మనిషి 150 ఏళ్లు బతకొచ్చా...






రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య అమరత్వం గురించి చర్చకు రావడం ఆసక్తిని రేపుతున్నది. అవయవ మార్పిడి ద్వారా ఎవరికైనా అమరత్వం సాధ్యమేనా? ఈ ఆసక్తికర చర్చ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగింది. బీజింగ్‌లో మిలిటరీ కవాతు సందర్భంగా వీరిద్దరూ కలుసుకున్న వేళ చర్చకు వచ్చిన అనూహ్యమైన అంశమిది. పుతిన్ మాట్లాడిన విషయాలను ఆయన అనువాదకుడు మాండరిన్ భాషలో జిన్‌పింగ్‌కు వివరించారు."మానవ అవయవాల మార్పిడి పదేపదే జరుగుతోంది. దీనివల్ల వయసు మీద పడుతున్నా యవ్వనవంతులు అవుతున్నారు.

బహుశా వృద్ధాప్యాన్ని దూరంగా ఉంచొచ్చు""ఈ శతాబ్దంలో మనిషి 150 ఏళ్లవరకు జీవించడం కూడా సాధ్యం కావచ్చని అంచనా వేస్తున్నారు" అని కూడా ఆయన చెప్పారు.షాంఘై సదస్సు సందర్భంగా బీజింగ్‌లో నిర్వహించిన మిలిటరీ కవాతు సందర్భంగా భేటీ అయిన ఈ ఇద్దరు అవయవాల మార్పిడి అంశంపై హాట్ మైక్‌లో చర్చించుకున్నట్లు తెలుస్తోంది. పుతిన్ మాట్లాడిన విషయాలను ఆయన అనువాదకుడు మాండరిన్ భాషలో జిన్‌పింగ్‌కు వివరించడం గమనార్హం.'ఇటీవలే మానవ అవయవాల మార్పిడి పదేపదే జరుగుతోంది. దీనివల్ల వయసు మీద పడుతున్నప్పటికీ యవ్వనవంతులుగానే కనిపిస్తున్నారు. బహుశా వృద్ధాప్యాన్ని దూరం చేసి అమరత్వం సాధించేందుకు అవయవాల మార్పిడి ఉపయోగపడుతుందేమో' అని పుతిన్ వివరించారు. అయితే ఈ విషయాలేవి బయటికి రాకుండా వారిద్దరు చిరునవ్వుతో ఏదో సరదా సంభాషణ జరుగుతున్నట్లుగా నటించారు.కానీ సామాజిక మాధ్యమం పుణ్యమా అని వీరి మాటలు బయటకు రావడం గమనార్హం. ప్రస్తుతం పుతిన్, జిన్‌పింగ్‌ల వయస్సు 72 ఏళ్లు. ఈ ఇద్దరు తమ దేశాలకు శాశ్వత అధ్యక్షులుగా ఉండాలని తాపత్రయపడేవాళ్లే. తన అధికారం నిలబెట్టుకోవడం కోసం పుతిన్ 2036 వరకు, అంటే అతనికి 83 సంవత్సరాలు వచ్చే వరకు రష్యాకు అధ్యక్షుడిగా ఉండేలా రాజ్యాంగాన్ని మార్చేయడం గమనార్హం.మరోవైపు జిన్‌పింగ్ కూడా 2018లోనే చైనా అధ్యక్ష పదవికి కాలపరిమితి తొలగించి బతికున్నంత వరకు తానే అధ్యక్షుడిగా ఉండేలా వీలు కల్పించుకున్నారు. బతికినంత కాలం తామే అధ్యక్షులుగా కొనసాగాలని భావించిన వీళ్లు అమరత్వం గు రించి మాట్లాడుకోవడం పెద్ద విషయమే కాదు. మరి అవయవ మార్పిడి తో అమరత్వం సాధ్యమేనా అన్న విషయం ఆరా తీస్తే.. అవయవ మార్పిడి ద్వారా ఎంతో మంది ప్రాణాలు నిలబడ్డాయి.ఎన్‌హెచ్‌ఎస్ బ్లడ్ అండ్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రకారం.. గత 30 సంవత్సరాల్లో ఒక్క యూకేలోనే అవయవ మార్పిడి ద్వారా లక్ష మంది ప్రాణాలను రక్షించినట్టు తె లుస్తోంది.జర్నల్ ఆఫ్ మెడికల్ ఎకనామిక్స్‌లో ప్రచురితమైన పరిశోధన ప్రకారం మూత్రపిండాల సగటు ఆయుర్దాయం 15 నుంచి 20 సంవత్సరాలు, కాలేయం 20 సంవత్సరాలు, గుండె 15 సంవత్సరాలు, ఊ పిరితిత్తులు 10 సంవత్సరాలు అని తేలింది.పుతిన్, జిన్ పింగ్‌లు కూడా బహుశా బహుళావయాల మార్పిడి గురించే మాట్లాడుకొని ఉంటారు. చివరగా ఇదే సైనిక కవాతు ప్రదర్శనలో ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ పాల్గొన్నారు. అయితే పుతిన్ భేటీ అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు ఆశ్చర్యపరిచాయి.కిమ్ వెళ్లిపోగానే.. వారు కూ ర్చున్న ప్రదేశం వద్దకు ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు కిమ్ కూర్చున్న కుర్చీని అదే పనిగా శుభ్రం చేస్తే, మరొకరు ఆయన వాడిన గ్లాస్‌ను జాగ్రత్తగా తీసుకెళ్లిపోయాడు.కిమ్‌కు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు ఆ ప్రాంతంలో లే కుండా, ఆయన డీఎన్ఏ ఎవరికీ చిక్కకుండా ఇలా వ్యవహరించి ఉ ంటారు. ఇప్పుడు శరీరం తిరస్కరించని అవయవాలను సృష్టించే పనిలో శాస్త్రవేత్తలు నిమగ్నమయ్యారు. ఇందుకోసం జన్యుమార్పిడి చేసిన పందులను దాతలుగా వినియోగిస్తున్నారు.మానవ శరీరానికి సరిపోయే ట్రాన్స్‌ప్లాంటెడ్ అవయవాన్ని తయారుచేసేందుకు సీఆర్ఐఎస్‌పీఆర్ అని పిలిచే జన్యు ఎడిటింగ్ సాధనంతో పందిలోని కొన్ని జన్యువులను తొలగించి, మానవ జన్యువులను జోడించారు.ఇందుకోసం ప్రత్యేకమైన పందులను పెంచుతున్నారు. వాటి అవయవాల సైజు మనుషులకు సరిపోవడమే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు.ఈ రంగం ఇంకా ప్రయోగాత్మక దశలోనే ఉన్నా, గుండె, కిడ్నీ ఆపరేషన్లు జరిగిపోయాయి. ఈ ఆపరేషన్ల కోసం అంగీకరించిన ఇద్దరు వ్యక్తులు ట్రాన్స్‌ప్లాంటేషన్ మెడిసిన్ రంగంలో మార్గదర్శకులుగా నిలిచిపోతారు. వారిద్దరూ మరణించినప్పటికీ ఒక జాతికి చెందిన కణాలు, కణజాలాలు, అవయవాలను మరో జాతిలోకి ప్రవేశపెట్టడానికి ఉపయోగపడే అడ్వాన్స్ జెనోట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సహాయకారులుగా నిలిచారు.మరోపక్క మానవ కణాలనుంచే కొత్త అవయవాలను సృష్టించే పద్ధతి కూడా పెరుగుతోంది. శరీరంలోని ఏ కణంలోనైనా, కణజాలంలోనైనా పెరిగే సామర్థ్యం స్టెమ్ సెల్స్‌కు ఉంది.డిసెంబర్ 2020 లో యూకే పరిశోధకులు (యుసిఎల్ ఫ్రాన్సిస్ క్రిక్ ఇన్‌స్టిట్యూట్) మానవ రోగ నిరోధక వ్యవస్థలో ముఖ్యభాగమైన థైమస్‌ను సృష్టించడంలో విజయం సాధించారు. మూలకణాలు, బయో ఇంజినీరింగ్ స్కాఫోల్డ్ సాయంతో దీన్ని రూపొందించారు. దీనిని ఎలుకలకు అమర్చినప్పుడు, ఇది బాగా పనిచేస్తున్నట్టు కనిపించింది.రోగి కణజాలం నుంచి మూలకణాలను ఉపయోగించి మానవ పేగులోని ఒక భాగాన్ని పెంచినట్లు లండన్‌లోని గ్రేట్ ఆర్మండ్ స్ట్రీట్ హాస్పిటల్ శాస్త్రవేత్తలు తెలిపారు.ఈ సాంకేతికత ఏదో ఒక రోజు పిల్లల పేగులలో సమస్యలను పరిష్కరించడానికి బాటలు పరుస్తుంది. కానీ ఈ పరిశోధన వ్యాధుల చికిత్స కోసమే కానీ, ప్రజల ఆయుర్దాయాన్ని 150 సంవత్సరాలకు పెంచడానికి కాదు.గతంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ ట్రంప్‌తో భేటీ అయిన అనంతరం ఇలాంటి జాగ్రత్తలే తీసుకున్నారని సమాచారం.ఆయన మలాన్ని తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా ఒక సూట్‌కేసుతో బాడీగార్డులు రావడం గ మనార్హం. తమ ఆరోగ్యానికి సంబంధించిన విషయాలు బయటపడ కుండా ఉండేందుకే ప్రపంచ నేతలు ఇలా జాగ్రత్తలు పాటిస్తున్నారేమో!

# చిత్తూరు నేతలకు లిక్కర్ లింక్...

**తిరుపతి – సూర్య వాస్తవం**

లిక్కర్ లింకులు మొత్తం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వైసీపీ చుట్టూ తిరుగుతున్నాయి. రోజు కొకరు విచారణకు హాజరు కావడం?. ఒకరి తర్వాత ఒకరు అరెస్ట్ అవుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న టెన్షన్ వైసీపీ శ్రేణుల్లో పెరిగిపోతుందంట. దీంతో నెక్స్ట్ ఎవరన్న చర్చ జిల్లాలో పొలిటికల్ సర్కిల్లో సాగుతోంది. అయితే అసలు లిక్కర్ కేసులో వీరికి సంబంధం ఉందా అని ఆశ్చర్యం కలిగేలా నేతలు అరెస్టు అవ్వడంతో ఇప్పుడు హాట్ టాపిక్ మారింది. ఆ క్రమంలో వైసిపి లోని కొందరు సీనియర్లు సైతం అసలు ఈ జిల్లాలో ఎవరెవరికి లింకులు ఉన్నాయి అని ఆరా తీస్తున్నారంట.. వైసీపీ హయాంలో రూ.3,500 కోట్ల లిక్కర్ స్కాం. ఏపీ లిక్కర్ స్కాం కేసులో సిట్ దూకుడు పెంచింది. రూ. 3500 కోట్లపైగా స్కాం జరిగినట్లు గుర్తించిన సిట్ అధికారుల దర్యాప్తులో పలువురు జైలుపాలవుతున్నారు. ఇప్పటికే ధనంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డితో పాటు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, చాణక్య, పైలా దిలీప్, బాలాజీ గోవిందప్ప ఈ కేసులో అరెస్ట్ అయ్యారు. పోలీసుల కస్టడీలో విచారణ ఎదుర్కుంటున్నారు. వారితో పాటు మరో 39 వరకు సిట్ నిందితులుగా చేర్చింది.

ఎన్నికల సమయంలో లిక్కర్ నిధులు పంచారని అభియోగాలు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేష్ నాయుడు అరెస్టు అయ్యారు.వారిద్దరూ అరెస్టు తరువాత రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిధున్ రెడ్డిని సిట్ అరెస్టు చేసింది. ఇక చెవిరెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి లిక్కర్ కేసులో నిందితుడిగా ఉన్నారు. లిక్కర్ స్కామ్ లో వచ్చిన ముడుపులను చంద్రగిరి సహా పలు నియోజకవర్గాలో ఎన్నికల సమయంలో పంచారని అభియోగాలను ఎదుర్కొంటున్నారు. అయితే ఈ కేసులో ఉన్న వారందరిలో చిత్తూరు జిల్లాకు చెందిన వారే ఎక్కువగా ఉండటం గమనార్హం. జిల్లాలకు చెందిన మిథున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బాలాజీతో పాటు కిరణ్ కూమార్ రెడ్డి, సైఫ్ అహ్మద్‌లపై కేసు నమోదు అయ్యింది. ఇప్పటికే అరెస్టు అయ్యి జైల్లో ఉన్న వీరందరినీ సిట్ విచారించింది. ఎప్పటికప్పుడు కొత్త పేర్లు వస్తుండటంతో వైసీపీలో కలవరం. ఇక అక్కడితే ఆగుతుందని జిల్లా నేతలు భావిస్తున్న తరుణంలో ఎప్పటికప్పుడు కొత్త పేర్లు బయట వస్తుండడంతో ఎప్పుడు ఏంఎవిూ జరుగుతుందనే




టెన్షన్ ఇటు నేతల్లోను కేడర్ నెలకొందట. ఇక తన వరకు ఇక కేసు రాదనుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి సైతం నెల క్రితం అయనకు సిట్ నోటీసులు ఇవ్వడంతో అనారోగ్య కారణాల వల్ల వాట్సాప్ లో పంపిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అయితే దానికి సంతృప్తి చెందని సిట్ అధికారులు నేరుగా నారాయణ స్వామి ఇంటికి వచ్చి అరుగంటల పాటు విచారణ జరిపారు. దాంతో ఇక మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన నారాయణస్వామి ఇక అరెస్టు అవుతారనే ప్రచారం జోరుగా సాగింది. అయితే సిట్ విచారణలో మద్యం పాలసీ మార్పులో ఆయన పాత్ర , అన్ లైన్ ద్వారా మద్యం బుకింగ్ లు మార్చి మ్యాన్ వల్ చేయడం, ప్రభుత్వ మద్యం దుకాణాల ఏర్పాటు, డిజిటల్ చెల్లింపులు ఎందుకు చేయలేదు అన్న అంశాలపై వందకు పైగా ప్రశ్నలు అడగటంమే కాకుండా టెక్నికల్ టీమ్స్ ద్వారా అయన గాడ్జెట్స్ ను పరిశోధించారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో అయన వాంగ్మూలం రికార్డు చేసినట్లు తెలిసింది. అయితే అయన చాలా ప్రశ్నలకు అంతా పైవారు చెప్పమన్నట్లు చేశానని చెప్పుకొచ్చారంట. ఆ క్రమంలో మొత్తం వ్యవహారం సీరియస్ అయ్యింది. అయితే నారాయణస్వామి ఎవరిపేర్లు చెప్పాదరనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.. విజయానందరెడ్డికి సిట్ నుండి పిలుపు. ఇక నారాయణ స్వామిని విచారణతో మాత్రమే సరి పెట్టడంతో అందరూ ఉపిరి పీల్చుకున్నారు.. అయితే ఊహించని విధంగా చిత్తూరు వైసీపీ ఇన్చార్జి విజయానందరెడ్డికి సిట్ నుండి పిలుపు రావడంతో విచారణ హాజర య్యారు. వైసీపీ హయాంలో మద్యం డిపోల నుంచి షాపులకు తరలించేందుకు ఆయన కాంట్రాక్టు పొందారనే సమాచారం. పొరుగు రాష్ట్రాల్లో రవాణా చేసే ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలకు ఇస్తున్న మొత్తం కన్నా ఎక్కువకు ఈ కాంట్రాక్టు దక్కించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో చెవిరెడ్డి సూచనల మేరకు లిక్కర్ ముడుపుల్ని వైసీపీ అభ్యర్థులకు విజయానందరెడ్డి చేరవేసినట్లు సిట్ గుర్తించింది. వీటన్నింటిపై సుదీర్ఘంగా సిట్ అధికారులు ప్రశ్నించినట్లు టాక్ నడుస్తోంది. అలా జిల్లాలో నగరిలో రోజాకు, తిరుపతి, కాళహస్తి, పూతలపట్టు, పీలేరు, జీడి నెల్లూరుకు అ నగదు చేరవేసినట్లు అనుమానిస్తు న్నారంట. వీటిపై ఆయన మొదట తనకు ఏమీ తెలియదని, మద్యం సరఫరా కాంట్రాక్టు మాత్రమే చేశానని బుకాయించా రంట. అయితే సిట్ అధికారులు చూపిన ఆధారాలతో గుట్టు విప్పక తప్పలేదంట. విజయానందరెడ్డిని సిట్ అధికారులు మరోసారి విచారణకు రావాలని చెప్పినట్లు సమాచారం. కీలక నేతల విచారణలతో వైసీపీ శ్రేణుల్లో టెన్షన్. చిత్తూరు జిల్లాలో వరుసగా వైసీపీ నేతలు సిట్ విచారణ హాజరవుతుండటంతో తర్వాత ఏం జరుగుతుందని టెన్షన్‌లో ఉన్నారట జిల్లా సీనియర్ నేతలు, క్యాడర్. జిల్లా సీనియర్ నేతల పరిస్థితి ఇలా ఉంటే మరోవైపు పార్టీ ప్రముఖులు సైతం అసలు కొన్ని విషయాలు తమకే తెలియని విధంగా ఉన్నాయంటూ ముక్కున వేలు వేసుకుంటున్నారట.

ఆ క్రమంలో అసలు జిల్లాలో ఏం జరిగిందన్న విషయాన్ని కొందరు పార్టీ సీనియర్లు జిల్లా నేతల నుంచి పూర్తిస్థాయి సమా చారాన్ని అడిగి తెలుసు కుంటున్నట్లు సమాచారం. ఇక వీరితో పాటు తిరుపతి మాజీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి సైతం లిక్కర్ స్కామ్‌లో భాగం ఉందంటూ టిడిపి నేత పట్టాభి చేసిన వ్యాఖ్యలు జిల్లా వైసీపీలో మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయంట. ఇక ఎన్నికల సమయంలో మద్యం డిపోల నుండి వేలాది మద్యం బాటిళ్లను జిల్లాలో పంపిణీ చేశారని, అలా పంపిణీ చేసిన వాటిలో నగరిలోనే అతిపెద్ద స్థాయిలో మద్యం డంప్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారని దానిని వెనుక ఎవరు ఉన్నారో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు కూటమి నేతలు. ఇలా రాష్ట్రంలోనే అతిపెద్ద లిక్కర్ స్కామ్ గా చెబుతున్న కేసులో వరుసగాచిత్తూరు జిల్లాకు సంబంధించిన నేతలే చిక్కుకోవడంతో పార్టీ శ్రేణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారట.

# పదే పదే చెబుతున్నా..మార్పు ఎక్కడ...

**విజయవాడ – సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా ప్రభుత్వంపై వచ్చే విమర్శలకునేతలు స్పందించడం లేదు. నిజంగా టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, అధికార పార్టీ ప్రతినిధులు యాక్టివ్‌గా లేకపోవడానికి కారణాలేంటి? అన్నదానిపై పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏడాది కాలమే అయింది. అయినా సరే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చాలా వరకూ చంద్రబాబు గ్రౌండ్ చేశారు. ప్రతి నెల ఒకటో తేదీన ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొంటున్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళుతున్నారు. అదే సమయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో కూడా చంద్రబాబు సమావేశమవుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో పాటు, అనేక అభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలను పదే పదే ప్రస్తావిస్తున్నప్పటికీ నేతలకు మాత్రం చీమకుట్టినట్లయినా లేదన్న టాక్ పార్టీలో బలంగా వినిపిస్తుంది. కేవలం



ఒకరిద్దరు మంత్రులు, కొందరు నాయకులు మాత్రమే వైసీపీ విమర్శలకు రియాక్ట్ అవుతున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వైసీపీ చేస్తున్న విమర్శలపై కూడా నేతలు స్పందించడం లేదు. ఉదాహరణకు ఇటీవల చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించారు. కుప్పం నియోజకవర్గానికి హంద్రీనీవా నీటిని విడుదల చేశారు. అయితే వైసీపీ సోషల్ మీడియాలో ఇది సినిమా సెట్టింగ్ అని, చంద్రబాబు వెళ్లి పోయిన తర్వాత నీరు మాయమయిందన్న పోస్టింగ్‌లు పెద్దయెత్తున కనిపిం చాయి. బోయపాటి శ్రీను ఫొటోతో రూపొందించిన పోస్టింగ్‌లు వైరల్ అయ్యాయి. అయినా చిత్తూరు జిల్లా నేతలు ఎవరూ దీనిపై ఖండించలేదు. అదే సమయంలో యూరియా కొరతపై ఈ నెల 9వ తేదీన వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమానికి దిగుతుంది. కానీ టీడీపీ నుంచి ఎవరూ పెద్దగా స్పందించలేదు. అంతెందుకు ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు రెండు రోజుల క్రితమే దీనిపై స్పందించారు. మిగిలిన మంత్రులు కూడా యూరియా కొరత లేదని చెప్పే ప్రయత్నం చేయలేదు. దీంతో పాటు సూపర్ సిక్స్ హామీలపై కూడా వైసీపీ విమర్శలు చేస్తున్నా అందుకు ధీటుగా నేతలు స్పందించడం లేదు. చంద్రబాబు నాయుడు పదే పదే హెచ్చరిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. మంత్రులు, అధికార ప్రతినిధులు, నేతల్లో నిరాసక్తతకు గల కారణాలేంటన్నది అంతు చిక్కకుండా ఉందంటు న్నారు టీడీపీ అభిమానులు. ఇప్పటికైనా చంద్రబాబు హెచ్చరికలు పనిచేస్తాయా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# జగన్ సభ్యత్వం రద్దయితే... ఉపఎన్నిక...

**కడప – సూర్య వాస్తవం**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు తప్పని సరిగా హాజరు కావాల్సి ఉంది. ఆయన అసెంబ్లీకి రాకపోతే ఎమ్మెల్యే పదవికే ఎసరు వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటి వరకూ బడ్జెట్ సమావేశాలు తొలి రోజు అంటే గవర్నర్ ప్రసంగం ఉండే సమయంలో మాత్రమే జగన్ తో పాటు ఆయన పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలు హాజరవుతున్నారు. పదకొండు మంది ఎమ్మెల్యేలు గత ఎన్నికల్లో గెలవడంతో వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని అధికార పక్షం చెబుతుంది. అదే సమయంలో శాసనసభలో ప్రతిపక్షం అనేది లేదు కాబట్టి తమకు ఆ హోదా ఇవ్వాలని వైసీపీ డిమాండ్ చేస్తుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం శాసనసభలో పది శాతం మంది సభ్యుల బలం ఉంటేనే ప్రతిపక్ష హోదా ఇస్తారు. అంటే కనీసం పందొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఉండాల్సి ఉం టుంది. అయితే గత ఎన్నికల్లో పదకొండు మంది ఎమ్మెల్యేలు మాత్రమే వైసీపీ నుంచి గెలవడంతో ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని కూటిమి పార్టీ లు చెబుతుంది. అయితే తమకు ప్రతిపక్ష హోదా దక్కితేనే ప్రజా సమస్యలపై చర్చించడానికి అవసరమైన సమయం దక్కుతుందని వైసీపీ వాదిస్తుంది. తమ గొంతు వినిపించని సభలో తాము ఎందుకు రావాలంటూ వైసీపీ ప్రశ్నిస్తుంది. అయితే ఈసారి ఖచ్చితంగా జగన్ తో పాటు ఎమ్మెల్యేలందరూ హాజరు కావాల్సి ఉంది. లేకపోతే రాష్ట్రంలో మరో ఉప ఎన్నిక వచ్చే అవకాశముంది. టీడీపీలో హాట్ టాపిక్ అరవై రోజులు వరసగా... ఒక సభ్యుడు వరసగా అరవై సమావేశ దినాలు గైర్హాజరయితే ఆ సభ్యుడు తన ఎమ్మెల్యే పదవి కోల్పోయే అవకాశముంది. ఆ నియోజకవర్గంలో ఎమ్మెల్యేను అనర్హుడిగా ప్రకటించే ఛాన్స్ ఉంది. ఈ అధికారం రాజ్యాంగంలో శాసనసభకు ఉంది. అయితే జగన్ మాత్రం ఈసారి అసెంబ్లీ సమావేశాలకు ఖచ్చితంగా హాజరు కావాల్సి ఉంటుంది. లేకపోతే పులివెందులకు ఉప ఎన్నికలు రావడం ఖాయంగా కనిపిస్తుంది. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోయినా జగన్ శాసనసభ సమావేశాలకు హాజరవుతారా? లేక ఉప ఎన్నికల్లో తేల్చుకుందామని జగన్ గైర్హాజరవుతారా? అన్నది చూడాల్సి ఉంది. జగన్ పంతానికి పోతే పదవికే ప్రమాదం సంభవిస్తుంది. రాజీ పడితే సభలో ఏం జరుగుతుందన్నది ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. శాసనసభకు హాజరైతే మాత్రం సమావేశాలు హాట్ హాట్ గా జరిగే అవకాశముంది.

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

**- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న బి.సర్వజ్ఞ మూర్తి**





**ప్యాపిలి– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** ప్యాపిలి మండలం హుసేనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. అన్వర్ బాష గారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులే సమ సమాజ నిర్మాతలు అని ఉద్ఘాటించారు. తదుపరి పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం హోస ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన తెలుగు ఉపాధ్యాయులు బి సర్వజ్ఞ మూర్తి గారిని పాఠశాల ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థుల సంఘం వారు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరగ డానికి ఆర్థికంగా సహకరించిన పూర్వ విద్యార్థి జెర్రిబండ వెంకట్రామిరెడ్డి కి ఉపాధ్యాయుల తరపున ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నరసింహుడు పాఠశాల కమిటీ చైర్మన్ రవికుమార్, తిమ్మారెడ్డి, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

## వేగ జువెలరీ మెగా ఎగ్జిబిషన్

**- పాల్గొన్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య**






**విజయవాడ– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** నందిగామ పట్టణంలోని రైతుపేటలో శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో శుక్రవారం నాడు వేగ జువెలరీ మెగా ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, "నగలు ఆడపడుచులకు అలంకారం మాత్రమే కాదు, అవి సంస్కృతి, సాంప్రదాయం, మరియు సౌందర్యానికి ప్రతీక. వేగ జువెలరీ ఈ ఎగ్జిబిషన్ ద్వారా స్త్రీలకు విభిన్న డిజైన్లలో నగలను అందించడం శ్లాఘనీయం," అని పేర్కొన్నారు. ఈ మెగా ఎగ్జిబిషన్‌లో సాంప్రదాయ మరియు ఆధునిక డిజైన్లతో కూడిన బంగారు, వజ్ర,వెండి నగలు, అలాగే ఇతర విలువైన ఆభరణాలు ప్రదర్శనకు ఉంచారు. పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు, వ్యాపారవేత్తలు, మరియు నగల ప్రియులు ఈ కార్యక్రమానికి హాజరై, వివిధ రకాల నగలను ఆసక్తిగా పరిశీలించారు. వేగ జువెలరీ నిర్వాహకులు, ఈ ఎగ్జిబిషన్‌లో నాణ్యమైన ఆభరణాలతో పాటు ఆకర్షణీయమైన ఆఫర్లను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ నందిగామలో నగల ప్రియులకు ఒక విశేష అనుభవంగా నిలిచింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్ విధించిన సుంకాలను రద్దుచేయాలి

**- మదనపల్లెలో నిరసన వ్యక్తం చేసిన సీపీఐ**

**మదనపల్లె – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** ట్రంప్ విధించిన సుంకాలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మదనపల్లెలో సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు సాంబ ఆధ్వర్యంలో స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద జరిగింది. వారు మాట్లాడుతూ.. అమెరికా అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్ర ఆక్వా, టెక్స్టైల్, గార్మెంట్స్ రంగాలు తీవ్రంగా దెబ్బ తింటున్నాయని తెలిపారు. మిల్లులు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న వేలాది మంది మహిళా కార్మికుల ఉపాధిప్రమాదంలో పడుతుంది అన్నారు.అమెరికా వీసా నిబంధనల కఠినతరం చేయడం సరైనది కాదన్నారు. అమెరికా విధానాల పట్ల కేంద్ర ప్రభుత్వ మౌనంగా ఉండటం సరైంది కాదన్నారు. భారతదేశ వాణిజ్య ఎగుమతి, దిగుమతులపై ట్రంప్ విధించిన సుంకాల టారిఫ్ లను తక్షణమే రద్దుచేయాలని, అమెరికా ఆంక్షల పట్ల మోడీ ఉదాసీన వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. అమెరికా ప్రపంచ పోలీస్ గా పెత్తనం చేయడం తగదన్నారు. అమెరికా ప్రపంచదేశాల మధ్య యుద్ధాలను ప్రోత్సహించి, ఆయుధవ్యాపారం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికయినా భారత్ రష్యా, చైనా దేశాలతో వాణిజ్య ఒప్పందాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మాధవ్, ముభారక్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కాంగ్రెస్ పార్టీ గళం

**- ఎకరాల కొద్ది ప్రభుత్వ స్థలాలు కబ్జా**
**- రీసర్వేతో నిజాలు బయటపడం తొలి విజయం**
**- పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ**

**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** పత్తికొండ నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ఎంక్రోచ్మెంట్లపై పత్తికొండ కాంగ్రెస్ పార్టీ తరపున ఎప్పటి నుండో మేము నిరంతరంగా గళం వినిపిస్తున్నాం. ప్రజల హక్కులు కాపాడటమే మా లక్ష్యం అని పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అడ్వకేట్ క్రాంతి నాయుడు అన్నారు. మే నెలలోనే ఈ సమస్యను కలెక్టర్, ఆర్డీఓ గారి దృష్టికి తీసుకెళ్లి, తగిన ఆదేశాలు సాధించాం. ఆ కృషి ఫలితంగానే నేడు అధికారికంగా చర్యలు తీసుకొని రిసర్వే చేశారు అని అన్నారు. రిసర్వే లో ఎమ్మిగనూరు



కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఖాసిం వలి, మైనారిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నూర్ అహ్మద్ కూడా పాల్గొన్నారు. మొదటిసారిగా పత్తికొండలోని ప్రభుత్వ స్థలాలైన సర్వే నంబర్ 95 వాగు మరియు 710 గయ్యాల భూముల సర్వే నంబర్లలో రెవెన్యూ అధికారులు రీ-సర్వే చేశారు. ఆక్రమణ, కబ్జా చేసిన వారికి నోటీస్ లు ఇచ్చి త్వరగా చర్యలు తీసుకోవాలని అని అధికారులను కోరడం జరిగింది. లేని పక్షంలో ప్రభుత్వ భూముల రక్షణ, ప్రజా హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది హైకోర్టులో కేసు కూడా నమోదు చేస్తాం అని తెలియజేశారు. ఎలాంటి అక్రమ ఆక్రమణలు, ఎంక్రోచ్మెంట్లు సహించబోమని, పత్తికొండ అభివృద్ధి కోసం ఇలాంటి పోరాటాలు ఇంకా ఎన్నో భవిష్యత్తులో మరింత బలంగా కొనసాగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ సాగర్, సర్వేయర్ యుగంధర్ ఇతర అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



### ఉపాధ్యాయులు ఇలాహీ బక్ష్‌కి

# సిల్వర్ జూబ్లీ ఎక్సలెన్సీ అవార్డు

**విజయవాడ– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6 :** గురువు ఒక దీప స్తంభం ఆయన వెలుగులోనే విద్యార్థుల భవిష్యత్తు ప్రకాశిస్తుంది. ఈ మాటలకు జీవం పోసిన ఉపాధ్యాయుడు ఇలాహీ బక్ష్. 25 ఏళ్లుగా హిందీ భాష బోధనలో తన అంకితభావాన్ని చూపిస్తూ, వందలాది విద్యార్థుల జీవితాలను వెలుగులు నింపిన ఆయనను, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భద్రాచలం పబ్లిక్ స్కూల్ యాజమాన్యం సిల్వర్ జూబ్లీ ఎక్సలెన్సీ అవార్డుతో సత్కరించింది. నందిగామ ప్రాంతానికి చెందిన ఇలాహి జూన్ 19, 2000న ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించిన ఇలాహీ బక్ష్, క్రమశిక్షణ, నిబద్ధత, తపన అనే మూడు విలువలను తన బోధనలో కలిపారు. విద్య అంటే కేవలం పాఠాలు కాదని వ్యక్తిత్వ నిర్మాణమని నమ్ముతూ, 25 ఏళ్లుగా ప్రతి తరగతిని స్ఫూర్తిదాయక వేదికగా మలిచారు.ఐటీసీ



సంస్థకు అనుబంధంగా నడుస్తున్న భద్రాచలం పబ్లిక్ స్కూల్‌లో, హిందీ విభాగాన్ని ఒక కొత్త స్థాయికి తీసుకెళ్లిన ఆయన, విద్యార్థుల్లో భాషా పట్ల ఆసక్తిని పెంచి, పలువురు ప్రతిభావంతులను తీర్చిదిద్దారు. తరగతి గది బోధనకే పరిమితం కాకుండా, క్రమశిక్షణతో కూడిన విలువలను విద్యార్థుల్లో నాటారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో, ఐటీసీ హెచ్‌ఆర్ మేనేజర్ శ్యామ్ కిరణ్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కిటుకులే చేతుల మీదుగా ఇలాహీ బక్ష్ ఈ సిల్వర్ జూబ్లీ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలుపుతూ, ఆయన కృషి అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు.ఇలాహీ బక్ష్ బోధన విధానం మాకు స్ఫూర్తి.

విద్యార్థుల పట్ల ఆయనకున్న అంకితభావం ఆయనను నిజమైన ఆదర్శ ఉపాధ్యాయునిగా నిలబెట్టాయి అని తోటి ఉపాధ్యాయులు ప్రశంసలు కురి పించారు. విద్యా రంగంలో నిబద్ధత, శ్రమ, అంకితభావం కలిసిన ప్రతీకగా నిలిచిన ఇలాహీ బక్ష్‌కి లభించిన ఈ సత్కారం, భవిష్యత్ తరాలకు ఒక సందేశం ఇస్తోందని ఐటిసి సంస్థకు చెందిన ఉన్నతాధికారులు తెలియజేశారు.

### శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో

# ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఆవశ్యకతపై వర్క్‌షాప్

**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నాడు విద్యార్థుల కోసం ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ కమ్యూనికేషన్ ప్రెజెంటేషన్ స్కిల్స్ అంశాలపై ఒకరోజు వర్క్‌షాప్‌ను ఘనంగా నిర్వహించారు. నేటి పోటీ వాతా వరణంలో విద్యార్థులు విజయాన్ని సాధించాలంటే సబ్జెక్ట్ నాలెడ్జ్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా అత్యంత అవసరమని ఈ వర్క్‌షాప్ ద్వారా మరోసారి ప్రతిపాదించబడింది. ఈ వర్క్‌షాప్‌కు ప్రముఖ ఇంగ్లీష్ కమ్యూనికేషన్ ట్రైనర్ ఏ. రామేశ్వర్ గౌడ్ ముఖ్య రిసోర్స్ పర్సన్‌గా హాజరై శిక్షణ అందించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన చెప్పారు – "ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం టెక్నికల్ నాలెడ్జ్ ఉన్నంత మాత్రాన సరిపోదు. దానిని సరైన రీతిలో వ్యక్తపరచడం, ఎదుటివారికి క్లుప్తంగా, స్పష్టంగా వివరించడం చాలా ముఖ్యం. ఆత్మన్యూనతా భావాన్ని దూరం చేసుకుని కమ్యూనికేషన్ స్కిల్స్‌లో నైపుణ్యం సాధిస్తే ప్రతి విద్యార్థి విజయాన్ని సాధించగలడు" అని పేర్కొన్నారు. అలాగే ఇంటర్వ్యూలలో తరచుగా ఎదురయ్యే ప్రశ్నలు, వాటికి సమాధానాలు చెప్పే విధానంపై విద్యార్థులకు మార్గ




దర్శకత్వం వహించారు. "ఇంటర్వ్యూ అనేది కేవలం టెక్నికల్ పరీక్ష మాత్రమే కాదు, మన వ్యక్తిత్వాన్ని, మన ఆలోచనలను, మన కమ్యూనికేషన్ శైలిని అంచనా వేయడానికి ఒక వేదిక. అందువల్ల విద్యార్థులు తమ ఆత్మ విశ్వాసాన్ని పెంచుకుని సరిగా ప్రాక్టీస్ చేస్తే ఏ ఇంటర్వ్యూనైనా సులభంగా అధిగమించగలరు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ... "మా కళాశాలలో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాము. మోటివేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, అర్థమెటిక్, రీజనింగ్ వంటి అంశాలలో శిక్షణ పొందితే విద్యార్థులు మరింత ఆత్మ విశ్వాసంతో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. నేటి తరానికి పోటీ ప్రపంచంలో నిలబడటానికి ఇవి తప్పనిసరి నైపుణ్యాలు. క్రమశిక్షణ, అంకితభావం, కష్టపడి చదివే మనస్తత్వం ఉంటే లక్ష్యం చేరుకోవడం చాలా సులభం. ప్రతి విద్యార్థి కళాశాలలో జరిగే ప్రతి అవగాహన కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలి" అని సూచించారు. ఈ వర్క్‌షాప్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొ న్నారు. విద్యార్థులు ఈ వర్క్‌షాప్ ద్వారా అనేక విలు వైన విషయాలను నేర్చుకున్నామని, భవిష్యత్తు కెరీర్‌లో ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు.



# సచివాలయ ఉద్యోగులు గాంధేయ పద్ధతిలో నిరసన

**గుత్తి – సూర్యవాస్తవం, సెప్టెంబర్ 6:** గుత్తి మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వార్డు సచి వాలయ ఉద్యోగులు గాంధేయ మార్గంలో నిరసన తెలిపారు. వాలంటీర్ విధులను నిరాకరిస్తూ, ఆంధ్రప్రదేశ్ విలేజ్ – వార్డు సచివాలయ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీవీడబ్ల్యుఎస్ఈజేఏసీ) పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా, మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు వినతిపత్రం సమర్పించారు.మమ్ములను వాలంటీర్ల కంటే హీనంగా చూస్తున్నారు. మేము సచి వాలయ ఉద్యోగులుగా అవ సరమైన విద్యార్హతతో ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీ క్షల్లో పాల్గొని మా ప్రతిభ చూపి ఉత్తీర్ణత సాధించి గౌరవ ప్రదమైన ఉద్యోగాలు చేస్తు న్నాము.మమ్ములను కాస్త గౌరవంగా చూడండి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వాలంటీర్ విధులు మాకు కాదు గౌరవం,ప్రమోషన్లు కావాలి గుత్తి సచివాలయ సిబ్బంది గాంధేయ నిరసన ఉద్యోగులు మాట్లాడుతూ మా హో



దా,గౌరవానికి విరుద్ధంగా వా లంటీర్ విధులు,డోర్ టు డో ర్ సర్వేలు, క్లస్టర్ మ్యాపింగ్ వంటి పనులు మాపై మోప బడుతున్నాయి. ఇవి మా అసలు పనులను ప్రభావితం చేస్తాయి.మాకు తగిన ప్రమోషన్లు, విధుల్లో గౌరవం, భద్రత కల్పించాలి. మా డిమాండ్ల కు న్యాయం చేయాలని ప్ర భుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి అని విజ్ఞప్తి చేశారు. మహిళా సిబ్బంది మాట్లాడుతూ,తమ విధుల్లో ఎదురవుతున్న చేదు అను భవాలను పంచుకున్నారు. ప్రజలు కొన్నిసార్లు మాతోచుల కనగా ప్రవర్తిస్తున్నారు.సర్వే సమ యంలో ప్రజల వ్యక్తిగత మొబైల్ నందు ప్రభుత్వ సేవలను చూపిం చమని కోరినప్పుడు అనుమానా లు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పనిచేయడం మాకు చాలా ఇబ్బందిగా మారింది. అ యినప్పటికీ పెన్షన్ పథకాల అ మలులో బాధ్యతగా వ్యవహరి స్తున్నాం.కానీ సర్వేల కారణం గా ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు పట్టించు కోవడం లేదుఅని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో సిబ్బంది విన య్, అప్ప స్వామి, గంగాధర్,కా మాక్షి, ప్రణతి, గంగా భవాని,రా జేంద్ర కుమార్, రంగస్వామి,కృ ష్ణమూర్తి, రాజశేఖర్, అరుణ్, సురేష్, రెడ్డప్ప, వెంకటకృష్ణ, హరీష్, కుసుమ కుమారి, గంగవరం లోకేష్, జయశ్రీ, కిరణ్ కుమార్, మెహ తాబ్, శివ, ప్రియాంక, సుజిత, రవి కుమార్ రెడ్డి, దుర్గా ప్రసాద్, షరీఫ్ సుమలత, చిన్న గంగాధర్, ఇమాం వలి, వేణు, అశ్వక్, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా పంపిణీ





**గాండ్లపెంట– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** మండలంలోని మలమీదపల్లి గ్రామంలో రైతు సేవా కేంద్ర పరిధిలో జరుగుతున్న యూరియా పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టరు ఆదేశాల ప్రకారం తహశీల్దార్ బాబురావు మరియు మండల వ్యవసాయాధికారి షాదాబ్ పర్యవేక్షించారు. త్వరలో మిగిలిన రైతు సేవా కేంద్రాల లో కూడా యూరియా అందుబాటులో ఉంటుందని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, సర్పంచ్, శ్రీరాములు, ఈశ్వర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి , సర్పంచ్ చలపతి రైతులు, వివిఎస్ఏ మనోహర్, ఎంపీఈఓ రవి నాయక్‌లు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

**- సత్యసాయి జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి నాగేంద్ర నాయక్**





**గాండ్లపెంట– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** మండల కేంద్రంలోని ఆకస్మిక తనఖీ శనివారం శ్రీ సత్యసాయి జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గాండ్ల పెంటను ఆకస్మిక తనఖీ చేసి రికార్డులను, ఆసుపపత్రి పని తీరును పరిశీలించి వ్యాధి నిరోదక టీకాలు మాతశిశు సంరక్షణ, అంటువ్యాధులు మొదలగుకార్యక్రమముల గురించి విచారించి, పరిసరాల శుభ్రత, ఓపి సేవలు, సూది మందులు ఇచ్చే గది, ల్యాబ్, కాన్పులు మరియు పేషంట్లుకు అందించు వైద్యసేవల గురించి విచారించారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మహేశ్వర మారుతి, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, డీహెచ్ఈఓ విజయ్, సూపర్వైజర్ విజయ కుమారి, స్టాఫ్ నర్స్ హరిత, ఫార్మసిస్ట్ ప్రసాద్, ఎల్ టి.శారదా, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక స్థాయిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం




**గాండ్లపెంట– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** మోడల్ ప్రైమరీ స్కూల్, కటారుపల్లి యందు ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది.కేవలం విద్యార్థులు నెల నుండి రోజువారి రహస్యంగా 2 వేలు పైగా పొదుపు చేసి పొదుపు చేసుకొని వారి స్వంతఖర్చుతో 6 కేజీ లు కేక్, మిక్సర్,డెకరేషన్ ,పూలు పండ్లు తెచ్చి ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులే ఇంత ఘనంగా నిర్వహించడం ఎక్కడా జరగలేదని మాకు ఈ అవకాశం ఇచిన పిల్లలు వారికి సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యా యులు విలువలతో కూడిన విద్య, మంచి వ్యక్తిత్వం,ఉన్నత లక్ష్యం,కష్టపడి చదవడం చేస్తే అనుకున్న లక్ష్యాలను చేరవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో షంషేర్, మాధవి, ప్రమీల, ప్రభావతి, ఓఎస్ శారద, ఆయా శ్రావణి, ఎండిఎం ఏజెన్సీ జిలాన్ పాల్గొన్నారు.

## ఎరువుల దకాణంలో ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ







**గాండ్లపెంట– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** మండల కేంద్రంలోని స్థానిక ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆర్డిఓ వివిఎస్ శర్మ ఆయన మాట్లాడుతూ ఎరువుల అంగడిలోనూ యూరియా బ్లాక్ లో అమ్మడం స్టాక్ పెట్టుకొని లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎరువుల దుకాణాలపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎరువుల అంగడిలో యజమాన్యానికి హెచ్చరించారు. అదేవిధంగా ఎరువుల అంగడిలు జెకె ఆగ్రో సీడ్స్ షాపుల కు 2,18,000 స్టాఫ్ సెల్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కదిరి ఏడిఏ సనావుల్లా, తహసిల్దార్ బాబురావు, ఏవో షాదబ్ పాల్గొన్నారు.

# బొప్పాయి రైతులకు మద్దతు ధర కల్పిస్తాం

**- బొప్పాయి ధర కిలో రూ.8లకు తక్కువ కాకుండా చర్యలు తీసుకుంటాం**
**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06:** చిట్వేలి, పెనగులూరు మండలాల్లో బొప్పాయి రైతులకు బొప్పాయి ధర కిలో రూ.8లకు తక్కువ కాకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చావుకూరి వెల్లడించారు. శనివారం చిట్వేలి మండల తాసిల్దార్ కార్యాలయంలో బొప్పాయి ధర నిర్ధారణపై మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పిం చేందుకు తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు.

**గత నిర్ణయాలు**

కిలోకు రూ.8ల ధర

ఆగస్టు 1వ తేదీన రైల్వేకోడూరులో రైతులు, ట్రేడర్లు, దళారులను సమావేశపరిచి కోడూరు, ఓబులవారిపల్లె మండలాల్లో బొప్పాయి కిలోకు రూ. 8గా ధరను నిర్ణయించారు. ఆగస్టు 28వ తేదీ వరకు అదే ధర కొనసాగేలా చర్యలు తీసుకున్నామన్నారు. ధరలు తగ్గకుండా ఉండేందుకు పోలీసు, రెవెన్యూ, హార్టికల్చర్ ఇతర ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసి చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. రైతులకు సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మూడు, నాలుగు క్రాప్ లలో కాయల సైజు తక్కువగా ఉండడం వల్ల తక్కువ రేటుకు విక్రయం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. చిట్వేలి, పెనుగులూరు మండలాల్లో ఆలస్యంగా బొప్పాయి పంట వేయడం వల్ల కోడూరు, ఓబులవారిపల్లె ప్రాంతాలతో వున్న రేటు ప్రభావం చిట్వేలి, పెనుగులూరు మండలాలకు కూడా వ్యాపిస్తోందని పేర్కొన్నారు.

**దిగుబడి వివరాలు**

చిట్వేలిలో మొత్తం బొప్పాయి దిగుబడి: 58,400 టన్నులు
ఇప్పటికే విక్రయం: 34,500 టన్నులు
ఇంకా విక్రయం చేయాల్సింది: 23,900 టన్నులు
మొదటి క్రాప్‌లో 2,300 టన్నులు, రెండో క్రాప్‌లో 6,700 టన్నులు కిలోకు రూ.7ల నుండి రూ. 8ల మధ్య విక్రయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.
మిగిలిన దిగుబడిని మూడు, నాలుగు క్రాప్‌లుగా వర్గీకరించి ట్రేడర్లతో సంప్రదించి కిలోకు రూ. 7ల ప్రకారం విక్రయం జరిపేందుకు చర్యలు తీసుకుంటాం.

**రోజువారీ ధర నిర్ణయం**

చిట్వేలి ప్రాంతానికి చెందిన 56 మంది ట్రేడర్లు, ఢిల్లీ నుంచి వచ్చిన సేట్ లు ప్రతిరోజు ఉదయం 6:30 గంటలకు సమావేశమై ధరను నిర్ణయించి కలెక్టరేట్‌కు తెలియజేస్తే తదనంతరం అదే ధరను మీడియా ద్వారా ప్రతిరోజు రైతులకు తెలియజేసి గందరగోళానికి తావులేకుండా చూస్తామని కలెక్టర్ తెలిపారు.

**చెక్ పోస్టులు, నిఘా చర్యలు**

చిట్వేలి, పెనుగులూరు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, వెహికల్‌ల రాకపోకలు, విక్రయ ధరలపై నిఘా కొనసాగించడంతోపాటు రైతులను ఇబ్బంది పెట్టే సెట్ లు దళారుల సంబంధిత వ్యక్తుల సమాచారం సేకరించి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

**ఇతర రాష్ట్రాలతో సమన్వయం**

ఢిల్లీ, లక్నో వంటి రాష్ట్రాల హోల్‌సేల్ మార్కెట్ ధరలను పరిశీలిస్తూ, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. దసరా పండుగ సందర్భంగా ఇంకా ధర పెరిగే అవకాశం ఉందని కూడా పేర్కొన్నారు.

**రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు**

సేట్‌లు, దళారులు కావాలని రైతులను ఇబ్బంది పెట్టితే, వారిని నోట్ చేసి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వారి ప్రయోజనాలను కాపాడేందుకు పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు.



# మీ సేవలు అభినందనీయం

**- అనంత మిల్క్ బ్యాంక్ డైటీషియన్లు బోయ సాయిపల్లవి, రాజేశ్వరి, కౌన్సెలర్ రాధకు ప్రసంశలు**
**- సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, ఆర్.ఎం.ఓ డాక్టర్ హేమలత కితాబు**




**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** విధి నిర్వహణలో మీ పని తీరు అద్భుతం. ఇదే స్ఫూర్తితో మున్ముందు కూడా సేవలు అందించండి అంటూ.. అనంత మిల్క్ బ్యాంక్ డైటీషియన్లు బోయ సాయిపల్లవి, రాయచూరు రాజేశ్వరి, కౌన్సెలర్ డా.రాధను ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్.ఎం.ఓ రామకృష్ణ, డిప్యూటీ ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జుల హేమలత అభినందించారు. జాతీయ పోషకాహార వారోత్సవాలలో భాగంగా అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అనంత మిల్క్ బ్యాంక్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్ నాయక్ అధ్యక్షత వహించగా.. పైన పేర్కొన్న వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతతో పాటు గర్భిణులు, బాలింతలు, శిశువులు, ఎదిగే పిల్లలకు ఎటువంటి ఆహారం అందించాలనే అంశాలను డైటీషియన్లు సాయి పల్లవి, రాజేశ్వరి, రాధ చక్కగా వివరించారు. అందు బాటులో అతి చౌకగా లభించే పండ్లు, కూరగాయల సేకరణ, వాడకం గురించి విద్యార్థులకు తెలిపారు. అనంతలో మిల్క్ బ్యాంక్ ఏర్పాటు ఆవశ్యకతను అర్థమయ్యేలా వివరిస్తూ, మిల్క్ బ్యాంక్ కు రోజు రోజుకూ లభిస్తున్న ఆదరణ, మిగులు పాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన, వస్తున్న తల్లుల గురించి తెలియజేశారు. పేపర్ ప్రజంటేషన్ గురించి తెలియజేస్తూ.. పాలు లేని తల్లులు, శిశువుల ఇబ్బందులు, మిగులు పాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను తాము తల్లులకు అవగాహన కల్పిస్తున్న తీరు గురించి అద్భుతంగా తెలియజేశారు. వారిని సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్.ఎం.ఓ రామకృష్ణ, డిప్యూటీ ఆర్.ఎం.ఓ గుజ్జుల హేమలత, మిల్క్ బ్యాంక్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్ నాయక్ అభినందించారు. మిల్క్ బ్యాంక్ విజయవంతంగా అమలుకు కారకులైన సాయిపల్లవి, రాజేశ్వరి, రాధను అభినందించారు. ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కోరారు. అనంతరం వారికి ప్రశంసాపత్రాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

## ఒక కుటుంబం

# ఒక పారిశ్రామికవేత్త స్ఫూర్తితో అడుగులు

**- ఏఐ ఫర్ ష్యూర్ శిక్షణలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**






**విజయవాడ– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** ప్రతి కుటుంబంలో ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్న గౌరవ ముఖ్యమంత్రి ఆలోచనలను ఆచరణలోకి తీసుకొచ్చేందుకు ఏఐ ఫర్ ష్యూర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను ఆధునిక సాంకే తికతతో గ్లోబల్ మార్కెట్లో అమ్మకాలు నిర్వహించుకొని.. ఆర్థిక ప్రగతి సాధించేందుకు అడుగులు ముందుకు వేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని రైతు శిక్షణ కేంద్రంలో డీఆర్‌డీఏ, మెప్మా, యూసీడీ సంయుక్త ఆధ్వర్యంలో ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త – ఏఐ ఫర్ ష్యూర్ కార్యక్రమాన్ని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాలో ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త విధానాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని, ఇప్పటికే ఓ మంచి ఆలోచనను వ్యాపారంగా ఎలా మలచు కోవాలి, అవసరమైన ఆర్థిక వనరులను ఎలా సమకూ ర్చుకోవాలి? తదితర అంశాలపై మహిళా పారిశ్రామిక వేత్తలతో బ్రాండింగ్, మార్కెటింగ్‌పై శిక్షణ ఇచ్చామని.. ఫలితంగా దాదాపు 700 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు కొత్త వ్యాపారాలు ప్రారంభించి, లఖ్‌పతి దీదీలుగా ముందడుగు వేయడం జరుగుతోందన్నారు. ఇప్పుడు స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను గ్లోబల్ మార్కెట్‌కు చేరువచేసుకునేందుకు ఆధునిక సాంకేతికతను ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై ఏఐ నిపుణులతో 160 మంది స్వయం సహాయక సంఘాల మహిళా వ్యాపారవేత్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. చాట్‌జీపీటీ వంటి వాటి సహాయంతో బ్రోచర్లు, ఫ్లయర్లు, బ్యానర్లు వంటి వాటిని తయారు చేసుకోవడం, రీల్స్, షార్ట్స్‌ను రూపొందించి వాటిని వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా తదితర సోషల్ మీడియా వేదికల్లో పోస్ట్ చేయడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్ అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయిపట్టి నడిపించడం జరుగుతోందన్నారు. పేపరుతో రూపొందించిన పర్యావరణహిత అందమైన బొమ్మలు, అలంకరణ ఉత్పత్తులు, వస్తువులు, హెర్బల్ ఉత్పత్తులు, మిల్లెట్స్ – తాటిబెల్లంతో తయారుచేసిన ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు, స్పోర్ట్స్ వేర్, సంప్రదాయ, ఫ్యాషన్ వస్త్రాల డిజైన్లు, లెదర్ వస్తువులు వంటివి మన మహిళా శక్తి సృజనాత్మకతకు ప్రతిరూపాలని.. వీటిని గ్లోబల్ మార్కెట్‌కు చేరువ చేయడం ద్వారా ఆర్థిక సాధికారత.. ఆపై జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయం వృద్ధి సాధ్యమవుతుందన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనకు ఇది తొలి అడుగు అని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.నిట్ – వరంగల్ ప్రొఫెసర్ డా. స్ఫూర్తి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి విజ్ఞప్తి మేరకు ఓ మంచి కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉందని.. రెండు సెషన్లలో ఆరుగంటల పాటు స్వయం సహాయక సంఘాల మహిళా వ్యాపారవేత్తలకు ఏఐతో పాటు డిజిటల్ మార్కెటింగ్ వేదికలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, యూసీడీ పీవో పి.వెంకట నారాయణ, గ్రామీణ జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ కె.కల్పన, అర్బన్ జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ కె.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఉన్న పాఠశాలలకు కొత్త భవనాల ఏర్పాటు తప్పనిసరి





**పెళ్లకూరు– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06:** తిరుపతి జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసి) గౌరీశంకర్, ఏఎంఓ శివశంకర్ ఆధ్వర్యంలో పెళ్లకూరు మండలంలోని పలు గ్రామ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీనాయుడు కండ్రిగ, యాలకారి కండ్రిగ, దొడ్లవారిమిట్ట గ్రామాల్లోని పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయని గుర్తించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా వీటిని కూల్చివేసి, కొత్త భవనాలు నిర్మించేందుకు చర్యలు ప్రారంభిస్తామని అధికారులు స్పష్టం చేశారు. అధికారులు మాట్లాడుతూ "పాఠశాల భవనాల నిర్మాణం విద్యార్థుల సంఖ్యను బట్టి తక్షణమే మంజూరు అవుతుంది. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా, బోధన వాతావరణం సక్రమంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.

## రైతులకు ఎరువుల కోతలపై పోస్టర్ ఆవిష్కరణ

**- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలకు ఆహ్వానం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**



**నాయుడుపేట –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06:** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు ఎరువుల కోతలపై ఈనెల 9వ తేదీన సూళ్లూరుపేటలో చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా రేపు అనగా ఆదివారం (07-09-2025) సాయంత్రం 4గంటలకు నాయుడుపేట పట్టణంలోని కిలివేటి వారి క్యాంపు కార్యాలయం నందు మాజీ ఎమ్మెల్యే, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ జరుగుతుంది. కావున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, ఆహ్వానించడం అయినది.

## ఎట్టకేలకు తాడిపత్రిలో అడుగుపెట్టిన పెద్దారెడ్డి

**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6 :** వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎట్టకేలకు తాడిపత్రిలో శనివారం అడుగుపెట్టారు. 15 నెలల తర్వాత పెద్దారెడ్డి సొంత ఇంటికి చేరుకున్నారు. ఎన్నికల సమయంలో ఘర్షణల కారణంగా ఆయన తాడిపత్రికి దూరంగా ఉంటున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో పెద్దారెడ్డి తాడిపత్రి చేరుకున్నారు. ఆయన ఇంటి వద్ద పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. తాడిపత్రిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. తిమ్మంపల్లిలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పెద్దారెడ్డి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బయలుదేరారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో పెద్దారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఓడినా.. గెలిచినా ప్యాక్షనిజం చేస్తామని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ఆయనను తాడిపత్రికి రాకుండా టిడిపి కార్యకర్తలు అడ్డుకుంటున్నారు. హైకోర్డు ఆర్డర్స్ ఉన్నప్పటికీ తనను తాడిపత్రి రానివ్వడం లేదని కేతిరెడ్డి ఘాటు విమర్శలు చేసిన విషయం తెలిసిందే. గతంలో తాడిపత్రికి కేతిరెడ్డి వచ్చినప్పుడు పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తులు ఆయన ఇంటిని చుట్టుముట్టడానికి ప్రయత్నించారు.



# తగ్గేదెలే అంటున్న కడప రెడ్డమ్మ..



**కడప– సూర్య వాస్తవం:** మూడు దశాబ్దాల తర్వాత తొలిసారి కడప గడ్డ మీద టీడీపీ జెండా ఎగిరింది. వైసీపీకి కంచుకోట లాంటి నియోజకవర్గంలో పాగా వేయగలిగినా? ప్రస్తుతం కడప సెగ్మెంట్‌లో పార్టీ పరిస్థితి అయోమయంగా మారిందట. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి సైకిల్ గుర్తు మీద విజయం సాధించారు రెడ్డప్పగారి మాధవి. నాడు ఆమె గెలుపు కోసం కృషి.. నానా తంటాలు పడ్డ డివిజన్ ఇన్చార్జ్‌ల్లో ఎక్కువ మంది ఇప్పుడు ఎమ్మెల్యేకు శత్రువులుగా మారినట్టు చెప్పుకుంటున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కష్టించి పని చేసిన తమను కాదని, మాధవి కొత్త వ్యక్తులకు ఇన్చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నారంటూ మండి పడుతున్నారట డివిజన్ నాయకులు. ఎన్నికలకు ముందు కడప నగర అధ్యక్షుడితో పాటు పలు డివిజన్స్‌కు ఇన్చార్జ్‌లను నియమించింది టీడీపీ. కానీ? మాధవి ఎమ్మెల్యే అయ్యాక మొత్తం మేటర్ మారిపోయిందట. గతంలో పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా తనకు అనుకూలమైన వారిని మాత్రమే ఇన్చార్జ్ పోస్టుల్లో నియమించినట్టు చెప్పుకుం టున్నారు. అదే ఇప్పుడు కేడర్‌లో అయో మయానికి ప్రధాన కారణమైందట. మూడు దశాబ్దాల తర్వాత ఇక్కడ పార్టీ జెండా ఎగరేసినా? తమకు మాత్రం ఎటువంటి ప్రయోజనం లేదని ద్వితీయ శ్రేణి నాయకులు ఆవేదన ఉన్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న తమను కాదని కొత్తవారికి ప్రాధాన్యత ఇవ్వడంపై ఆగ్రహంగా ఉన్నారట. నిన్న మొన్నటి వరకు కుర్చీ గోలతో వివాదాల్లోకి ఎక్కిన కడప ఎమ్మెల్యే? ఇప్పుడు మరో విషయంలో నేను మోనార్క్‌ని అంటున్నట్టు సమాచారం. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో? తాను చెప్పిన వ్యక్తులే కడప కార్పొరేటర్లుగా పోటీ చేస్తారని ఆమె బహిరంగంగా అంటున్నారట. ఆ స్టేట్‌మెంట్స్ కారణంగా? టీడీపీలో వర్గ విభేదాలు పెరుగుతు న్నాయంటున్నారు. అంతా ఆమె ఇష్టమేనా? పార్టీకంటూ ఒక నిర్ణయం ఉంటుంది కదా.. అంటూ స్థానిక తెలుగుదేశం నాయకులే గుసగుసలా డుకుం టున్నారు. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని ఉన్న తమను కాదని కొత్త వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై సీనియర్ నేతలు కూడా పెదవి విరుస్తున్నారు. కడప కార్పొరేషన్ లో ఖాళీగా ఉన్న రెండు కార్పొరేటర్ స్థానాలకు ఉప ఎన్నికల నిర్వహణ కోసం ఇక ఎప్పుడైనా? నోటిఫికేషన్ రావచ్చునుకుంటున్న టైంలో? ఎమ్మెల్యే వైఖరి చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే మాధవితో పాటు ఆమె భర్త, పార్టీ జిల్లా అధ్యక్షుడు వాసు నగరంలోని పలు డివిజన్స్‌లో పర్యటన చేస్తూ అప్పుడే మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని కూడా మొదలు పెట్టేశారట. వాస్తవానికి మున్సిపల్ పాలక మండలికి ఇంకా ఏడు నెలల గడువుంది. ఆలోపే? రెండు కార్పొరేటర్ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారంతో? అప్పుడే ఎన్నికల హడావిడి మొదలైంది. అదే సమయంలో మాధవి కూడా తాను చెప్పిన వ్యక్తులే అభ్యర్థులుగా ఉంటారని ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. అలాగైతే? ఇన్నాళ్లు పార్టీని నమ్ముకుని పనిచేసిన తమ పరిస్థితి ఏంటన్నది పలువురు సీనియర్స్ క్వశ్చన్. పార్టీ ఆదేశాలు పాటించకుండా? తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే పై అధిష్టానానికి ఫిర్యాదు చేయాలని ద్వితీయ శ్రేణి టిడిపి నాయకులు భావిస్తున్నారట. కడప టీడీపీ హడావిడి, వర్గపోరుకు పార్టీ పెద్దలు ఎలాంటి ట్రీట్‌మెంట్ ఇస్తారో చూడాలి

## యువనేత నెలవల రాజేష్ జన్మదిన వేడుకల్లో పెళ్లకూరు టీడీపీ నాయకుల సందడి

**పెళ్లకూరు– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06:** తెలుగుదేశం పార్టీ యువనేత నెలవల రాజేష్ జన్మదిన వేడుకలు నాయుడుపేట పట్టణంలోని ఆయన నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల రాజేష్ కేక్ కట్ చేసి నాయకులు, అభిమానులతో ఆనందాన్ని పంచుకున్నారు. వేడుకల్లో పెళ్ళకూరు మండల టీడీపీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆయకట్టు చైర్మన్ దామెర్ల ప్రసాద్ నాయుడు, వేణు రెడ్డి సహా పలువురు నాయకులు పాల్గొన్నారు. నెలవల రాజేష్ కు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానం చేసి, ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... "టీడీపీ యువనేత నెలవల రాజేష్ పార్టీ బలోపేతం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తున్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని మేము కోరుకుంటున్నామన్నారు.



## అక్రమ రేషన్ బియ్యం రవాణాకు కేంద్ర బిందువుగా పెళ్లకూరు మండలం

**- పేదలకు ఇచ్చిన ధాన్యం స్మగ్లర్ల జేబులకు చేరుతోంది**
**- అధికారుల నిర్లక్ష్యమే అక్రమార్కులకి లైసెన్స్**

**పెళ్లకూరు– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06:** పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న చౌక ధరల రేషన్ బియ్యం, పెళ్లకూరు మండలంలో అక్రమార్కులకు వరంగా మారింది. రాత్రింబవళ్లు ఆగని రవాణాతో, ఈ ప్రాంతం ఇప్పుడు రేషన్ స్మగ్లర్లకి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 24 పంచాయతీల నుండి సేకరించిన రేషన్ బియ్యం, పేదల ఇళ్లలో చేరకముందే దళారుల చేతుల్లో పడిపోతుంది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, చిన్న వాహనాల ద్వారా తరలించబడుతున్న బియ్యం, చివరికి పెద్ద స్థాయిలో నిల్వ చేసి అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పేద ప్రజలకు రావలసిన నిత్యావసర ధాన్యం ఇలా స్మగ్లర్ల చేతిలో 'నలుపు దందా'కి మారిపోతోంది. ప్రభుత్వం బయోమెట్రిక్ విధానం అమలు చేసినా, రేషన్ అక్రమ రవాణా తగ్గే సూచనలు కనిపించడం లేదు. అధికారులు పలు మార్లు దాడులు జరిపి కేసులు నమోదు చేసినా ఫలితం శూన్యం. స్మగ్లర్లు మళ్లీ మళ్లీ అదే దందా కొనసాగిస్తూ, ప్రతి నెల లక్షల్లో లాభాలు ఆర్జిస్తున్నారు. చట్టం ప్రకారం అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేస్తే పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నప్పటికీ, వ్యవహారంలో మాత్రం అధికారులు సడలింపులు ఇస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పీడీ యాక్ట్ కేసుల్లో జైలు శిక్ష తప్పదని తెలిసినా స్మగ్లర్లు ధైర్యంగా రవాణా కొనసాగిస్తుండటం ఆశ్చర్యకరమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "పేదలకు చెందవలసిన బియ్యం కడుపులు నింపకుండానే, మధ్యలోనే స్మగ్లర్లకు చేరిపోతోంది. ఇకనైనా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలి" అని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంబంధితశాఖ అధికారులు నిజంగా కఠినంగా పర్యవేక్షిస్తే, పెళ్లకూరు మండలంలో ఈ అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని వారు స్పష్టం చేస్తున్నారు.



## టీడీపీ యువనేత నెలవల రాజేష్‌కి జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ

**- యువ నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం దంపతులు**
**- రాజేష్‌కి శాలువాళ్ళతో సన్మానించి పుష్పగుచ్చములు అందజేసి శుభాకాంక్షలు తెలిపిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ**

**నాయుడుపేట –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06:** తెలుగుదేశం పార్టీ యువనేత నెలవల రాజేష్ జన్మదిన వేడుకలు శనివారం నాయుడుపేట పట్టణంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల రాజేష్ భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం నాయుడుపేట ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజ కవర్గ ఇంచార్జ్ ఉయ్యాల ప్రవీణ్, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, టిడిపి నేత, ఎస్.జె జువెలరీస్ అధినేత పోట్లపూడి రాజేష్ పలువురు తెలుగు దేశం పార్టీ నాయకులు నెలవల రాజేష్‌కు శాలువాలు కప్పి పూలమాలలు వేసి, సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి నేత నెలవల రాజేష్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నెలవల రాజేష్ మాట్లాడుతూ..... నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి నన్ను అభిమానించే నాయకులకు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.








# వైభవంగా సైమా 2025 అవార్డ్స్

**దుబాయ్ :** ప్రతిష్ఠాత్మక సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా) 2025 వేడుక దుబాయ్ వేదికగా అంగరంగ వైభవంగా జరిగింది. తొలి రోజు కన్నడ, తెలుగు మూవీల్లో ప్రతిభ కనపరిచిన సినీ నటీనటులు అవార్డులను సొంతం చేసుకున్నారు. 2024లో విశేష ప్రతిభ కనబరిచిన నటీనటులు, చిత్రాలకు అవార్డులు అందించారు. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన సైన్స్ ఫిక్షన్ మూవీ కల్కి 2898 ఏడీ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ నటిగా రష్మిక మంధాన, ఉత్తమ దర్శకుడిగా సుకుమార్ అవార్డులు సొంతం చేసుకున్నారు.

**సైమా 2025 అవార్డులు (తెలుగు) :**

-ఉత్తమ చిత్రం - కల్కి 2898 ఏడీ
ఉత్తమ నటుడు - అల్లు అర్జున్ (పుష్ప2)
ఉత్తమ నటి - రష్మిక మందన్నా (పుష్ప2)
ఉత్తమ దర్శకుడు - సుకుమార్ (పుష్ప2)
ఉత్తమ నటుడు (క్రిటిక్స్) - తేజ సజ్జా (హనుమాన్)
ఉత్తమ నటి (క్రిటిక్స్) - మీనాక్షి చౌదరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ దర్శకుడు (క్రిటిక్స్) - ప్రశాంత్ వర్మ (హనుమాన్)
ఉత్తమ సహాయ నటుడు - అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 ఏడీ)
ఉత్తమ సహాయ నటి - అన్నే బెన్ (కల్కి 2898 ఏడీ)
ఉత్తమ సంగీత దర్శకుడు - దేవి శ్రీ ప్రసాద్ (పుష్ప2)
ఉత్తమ గీతరచయిత - రామ్ జోగయ్య శాస్త్రి (చుట్టమల్లే)
ఉత్తమ గాయకుడు - శంకర్ బాబు కందుకూరి
ఉత్తమ గాయని - శిల్పా రావు (చుట్టమల్లే)
ఉత్తమ విలన్ - కమల్ హాసన్ (కల్కి 2898 ఏడీ)
ఉత్తమ పరిచయ నటి - భాగ్యశ్రీ బోర్సే (మిస్టర్ బచ్చన్)
ఉత్తమ పరిచయ నటుడు - సందీప్ సరోజ్
ఉత్తమ పరిచయ దర్శకుడు - నంద కిషోర్ యేమని
ఉత్తమ కొత్త నిర్మాత - నిహారిక కొణిదెల (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ - రత్నవేలు (దేవర)
ఉత్తమ హాస్యనటుడు - సత్య (మత్తు వదలరా 2)
ప్రైడ్ ఆఫ్ తెలుగు సినిమా - అశ్వినీదత్ (వైజయంతీ మూవీస్)

# సామాజిక స్వభావమే 'ఘాటీ'



- చిత్ర కథా రచయిత చింతకింది శ్రీనివాసరావు

'సామాజిక స్వభావంలో మార్పు వస్తేనే ప్రజా సమూహం ప్రగతిపథంలో పయనిస్తుంది. మనిషి కేంద్రంగా నడిచే సమాజం మానవత్వంతో వ్యవహరించినప్పుడే సత్ఫలితాలు లభిస్తాయి. తూర్పు కొండల్లో సాగుతున్న గంజాయి సేద్యాన్ని సామాజిక సమస్యగా భావించాల్సిన అవసరం ఉంది. ఆ రకమైన దృక్కోణాన్ని సమాజానికి అందించే ప్రయత్నం మా ఈ 'ఘాటీ' చిత్రం ద్వారా చేశాం. సుప్రసిద్ధ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తన ప్రతిభ, మేథా శక్తితో చిత్రాన్ని తూర్పు కనుమల స్థాయికి తీసుకెళ్లారు. చిత్ర కథానాయిక అనుష్క, కథానాయకుడు విక్రమ్ ప్రభు గంజాయి సమస్యను కళ్లకు కట్టినట్లుగా తమ అభినయంతో వెల్లడించారు. సాహితీ రంగంలో రచయితగా కొనసాగుతున్న నన్ను 'అరేబియా కడలి' వెబ్ సిరీస్ ద్వారా తెలుగు తెరకు క్రిష్ పరిచయం చేశారు. అంతేకాదు ఆ సిరీస్‌లో ముఖలింగం అనే ప్రధాన పాత్ర ద్వారా నన్ను నటుడిగా చేశారు. ఇప్పుడు 'ఘాటీ' చిత్ర కథకుడుగా వెండితెరకు చేరువ చేశారు. ఇందుకుగాను క్రిష్ జాగర్లమూడికి హృదయ పూర్వక కృతజ్ఞతలు. ఈ నెల ఐదోతేదీన విడుదలైన 'ఘాటీ' సినిమాకు ప్రేక్షకుల ఆదరణ బాగా ఉండటం ఎంతో సంతోషానిస్తోంది. భవిష్యత్తులో మరిన్ని మంచి కథలు రాయటానికి దోహదపడుతోంది. స్థానికతతో ఉన్న సినిమాలకూ, సామాజిక రుగ్మతలపై తీసిన సినిమాలు ఇటీవలకాలంలో మంచి ప్రజా దరణ పొందుతున్నాయి. గంజాయి వికృత రూపాలను ఈ సినిమా ద్వారా మేము సమాజం మందుకు తెచ్చాం. యువత సన్మార్గంలో పయనించటానికి ఈ సినిమా దోహదపడుతుందనే నమ్మకం ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ ద్వారా నిజమైంది. ఆంధ్రా, ఒరిస్సా బోర్డర్‌లో శీలవతి గంజాయి రకం పెరుగుతుంది. దీనికి ప్రపంచ వ్యాప్తంగా చాలా డిమాండ్ ఉంది. వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంటుంది. దానికోసం ఒక వ్యవస్థ పని చేస్తుంటుంది. గంజాయి బస్తాలను మోయడానికి కొంతమంది కూలీలు ఉంటారు. ఇతంతా ప్రపంచానికి చూపించేందుకే ఈ కథను క్రిష్‌కు చెప్పా. క్రిష్ ఎంతో అద్భుతంగా ఈ సినిమాను తెరకెక్కించారు. భవిష్యత్తులో మరిన్ని సమాజ హితమైన కథలతో సినిమాలు వచ్చేందుకు నా వంతుగా కృషిచేస్తా' అని ప్రఖ్యాత రచయిత, ఘాటీ సినిమా కథకుడు చింతకింది శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. కళింగాంధ్ర కథా బలాన్ని ప్రపంచానికి తెలియజేసిన చింతకింది రచనలు సాహితీ రంగంలో స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. 'మున్నీటి గీతలు' వంటి ఆయన రచనలు సామాజిక మార్పు కోసం పరితపించాయి. తాజాగా చింతకింది రాసిన కథ-ఘాటీ చిత్రంగా ఒకనొక సామాజిక సమస్యను తెలుగు సినిమా తెరమీదకు తీసుకొచ్చింది. శుక్రవారం విడుదలైన ఈ సినిమాతో గంజాయి మహమ్మారిపై చర్చలు పెద్దఎత్తున కొనసాగుతున్నాయి. అవన్నీ ఫలవంతం కావాలని మనమంతా కోరుకుందాం.



# ఫైనల్‌కు భారత్

- నేడు స్వర్ణ పతకానికి కొరియాతో ఢీ
- చైనా, మలేషియా మధ్య కాంస్య పతక పోరు

ఆసియాకప్ హాకీ



**రాజ్‌గిర్(బీహార్):** ఆసియా కప్ హాకీ ఫైనల్లోకి భారతజట్టు దూసుకెళ్లింది. శనివారం జరిగిన నిర్ణయాత్మక చివరి సూపర్-4 మ్యాచ్‌లో భారత్ 7-0తో చైనాపై ఘన విజయం సాధించింది. తొలి రెండు క్వార్టర్‌లు ముగిసేసరికి 3-0 ఆధిక్యతలో నిలిచిన భారత్.. మూడో క్వార్టర్‌లో రెండు, నాల్గో క్వార్టర్‌లో మరో రెండు గోల్స్ కొట్టి సత్తా చాటింది. సూపర్-4లో భాగంగా తొలి లీగ్ మ్యాచ్‌లో ఐదుసార్లు ఛాంపియన్ కొరియాతో మ్యాచ్‌ను 2-2తో డ్రా చేసుకొని నిరాశపరిచిన భారత్.. రెండో లీగ్ మ్యాచ్‌లో మలేషియాపై 4-1గోల్స్‌తో విజయం సాధించింది. నిర్ణయాత్మక మూడో, చివరి సూపర్-4 మ్యాచ్‌లో ఏకంగా 7-0తో చైనాను చిత్తుచేసి అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. ఇక చివరి సూపర్-4 లీగ్ మ్యాచ్‌లో కొరియా జట్టు 4-3గోల్స్ తేడాతో మలేషియాను చిత్తుచేసింది. దీంతో కొరియా జట్టు 4పాయింట్లతో 2వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. చైనా, మలేషియా మూడేసి పాయింట్లతో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. ఈ జట్ల మధ్య కాంస్య పతక పోరు, భారత్-కొరియా జట్ల మధ్య స్వర్ణ పతక పోరు ఆదివారం జరగనుంది.

**జపాన్‌తో అమ్మాయిలు డ్రా..**

హాంగ్జౌ వేదికగా జరుగుతున్న ఆసియాకప్ మహిళల హాకీలో భారత మహిళలజట్టు పటిష్ట జపాన్‌ను నిలువరించింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో నాల్గో క్వార్టర్ చివర్లో భారతజట్టు ఒక గోల్ చేసి డ్రాతో సరిపుచ్చుకుంది. తొలి క్వార్టర్ 10వ ని.లో జపాన్ జట్టు తొలి గోల్ కొట్టి 1-0 ఆధిక్యతలో నిలిచింది. రెండో క్వార్టర్‌లో భారత్ గోల్ చేయడంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి 1-1 గోల్స్‌తో సమంగా ఉన్నాయి. ఇక రెండో అర్ధభాగంలో ఇరుజట్లు ఆధిక్యత కోసం తీవ్రంగా పోటీపడ్డాయి.

మూడో క్వార్టర్‌లో ఏ జట్టూ గోల్ చేయలేదు. నాల్గో క్వార్టర్‌లో చివరి ఐదు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా జపాన్ ఒక గోల్ కొట్టి 2-1గోల్స్ ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో చివరి సెకన్లలో భారత్ గోల్ చేయడంలో అభిమానులు కేరింతలతో స్టేడియం మార్మోగింది. గ్రూప్-బి తొలి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు 11-0గోల్స్ తేడాతో థారులాండ్‌ను చిత్తుచేసిన సంగతి తెలిసిందే. ఇక జపాన్ జట్టు తొలి లీగ్ మ్యాచ్‌లో సింగపూర్‌పై 9-0తో గెలిచింది. చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు సింగపూర్‌తో తలపడనుంది



# మళ్లీ వాళ్లిద్దరే..

## - యుఎస్ ఓపెన్ ఫైనల్‌కు సిన్నర్, అల్కరాజ్
## - సెమీస్‌లో ఓడిన జకోవిచ్, అగర్

**న్యూయార్క్:** టాప్‌సీడ్ జెన్నిక్ సిన్నర్, 2వ సీడ్ కార్లోస్ అల్కరాజ్ మరో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లోకి దూసుకెళ్లారు. 2025 ఏడాదిలో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో తలపడిన వీరు.. వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో తలపడనున్నారు. శనివారం తెల్లవారుజామున జరిగిన సెమీఫైనల్లో సిన్నర్ 25వ సీడ్, కెనడాకు చెందిన అగర్ అలియాస్సిమ్‌ను, మరో సెమీస్‌లో అల్కరాజ్.. 7వ సీడ్, 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్‌ను ఓడించాడు. తొలి సెమీస్‌లో ఇటలీకి చెందిన సిన్నర్ 6-1, 3-6, 6-3, 6-4తో అగర్‌ను ఓడించాడు. దీంతో ఈ ఏడాది వరుసగా నాల్గో గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు చేరుకున్నాడు. 2025లో ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను సిన్నర్ చేజిక్కించుకున్నాడు.

రెండో సెమీస్‌లో యువ ఆటగాడు, స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్ జోరు ముందు సీనియర్ ఆటగాడు నొవాక్ జకోవిచ్ నిలువలేకపోయాడు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ 6-4, 7-6(7-4), 6-2తో ముగించి రికార్డు గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన జకోవిచ్‌కు మరోసారి అడ్డుగా నిలిచాడు.

# ఎన్నికల హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రి..

- సీఎం ప్రోగ్రాంకి భారీగా తరలివస్తున్న ప్రజలు: ఎమ్మెల్యే కాలువ
- దాదాపుగా నాలుగు లక్షల మందితో భారీ బహిరంగ సభకు సన్నద్ధం
- అధినేత రాక కోసం ఎదురుచూస్తున్న కార్యకర్తలు : కాలు శ్రీనివాసులు





**రాయదుర్గం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు భారీగా ప్రజలు తరలి వస్తున్నారని రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ కాలువ శ్రీనివాసులు అన్నారు. అధినేత రాకతో జిల్లాలో పలు గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో మహిళలు, కార్యకర్తలు ఆయన పేర్కొన్నారు. అనంత పురంలో ఈనెల 10న చేపట్టనున్న సూపర్ సిక్స్‌బి సూపర్ హిట్ సభను విజయ వంతం చేయడానికి పార్టీ నాయకులకు, కార్య కర్తలు తమ వంతు బాధ్యతగా పని చేయాలని శాసన సభ్యులు కాలవ శ్రీనివాసులు సూచించారు. రాయదుర్గం పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి ఫంక్షన్ హాల్ లో శనివారం ఆయన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భారీ సభను తొలిసారి జిల్లాలో నిర్వహిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు రాష్ట్ర మంత్రులు, కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు వివరి ంచారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 3.50 లక్షల మందితో భారీ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిం దన్నారు. రాయదుర్గం నియోజకవర్గం నుంచి 15 వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను తరలించడానికి తగిన ఏర్పాట్లు చేద్దామని సూచించారు. కనీసం 10వేల మందికి బస్సులు, ఇతరత్రా రవాణా వాహనాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మిగిలిన వారు తమ సొంత వాహనాల్లో లేదా ఇతరాత్ర రవాణా ద్వారా సభాస్థలికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఏ ఏ ప్రాంతాల నుంచి ఎంత మంది వస్తారన్న విషయాన్ని మండలాల వారీగా చర్చిద్దామని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇది తమ బాధ్యతగా గుర్తించి ఎక్కువమంది సభకు హాజరయ్యేలా చూడాలన్నారు. రాయదుర్గం నియోజకవర్గ పరిశీలకులుగా మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డిలను పార్టీ అధిష్టానం నియమించిందన్నారు. సభను విజయవంతం చేయడానికి మన నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున జనాలు వచ్చారని అధిష్టానం వద్ద వారు గర్వంగా చెప్పుకునేలా ఏర్పాట్లు చేద్దామని పిలుపునిచ్చారు. ఆ విధంగా తగిన ప్రణాళిక సిద్ధం చేసుకుని ఎవరికి వారు బాధ్యతలను తమ భుజస్కందాలపై వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పదో తేదీ నాటి భారీ సభ విజయవంతనికి ఇప్పటినుండి సిద్ధం కావాలని సూచించారు. వైకాపా అధినేత జగన్ అసెంబ్లీకి దుమ్మా కొడుతూ తనను ఎన్నుకున్న ప్రజల జవాబుదారీతనాన్ని విస్మరించారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. ప్రభుత్వం ప్రతిపక్ష హెూదా ఇవ్వకపోతే..! అసెంబ్లీకి రానని ఎవరిని బెదిరిస్తారని ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో వారు సాగించిన అరాచకాలు, అకృత్యాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్తూ ప్రతిపక్ష హెూదా లేకుండా తీర్పు ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి ఒక్కరి అవసరాలను గుర్తించి ఒక్కోటిని పరిష్కరిస్తూ ముందుకు వెళుతుందనన్నారు. మహిళలు, విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులు, పారిశ్రామిక వర్గాలు, వృత్తిదారులు ఇలా అన్ని రకాల వర్గాలకు చెందిన వారికి ప్రభుత్వం తగిన సహాయం అందిస్తోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాల్సిన అవసరం మనందరిపై ఉందని గుర్తు చేశారు. ఈ సభను అందుకు ఓ వేదికగా మార్చుకొని గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తద్వారా గ్రామాల్లో మీ ప్రతిష్ట, పరపతి కూడా పెరుగుతుందని రాబోయే రోజుల్లో మీరు ఉన్నతంగా ఎదగడానికి దోహదపడుతున్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలో దొంగల పాలన, దోపిడి దారుల రాజ్యం కొనసాగిందని తెలుగురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ధ్వజమెత్తారు. అలాంటి రాష్ట్రాన్ని ఓవైపు చంద్రబాబు నాయుడు, మరోవైపు నారా లోకేష్ బాబు సహచర మంత్రివర్గం కలసికట్టుగా పనిచేస్తూ చక్కదిద్దే పనిలో పడ్డారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఐదింటిని నెరవేర్చడం జరిగిందని, ఆ ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులుగా మాజీ మంత్రి దేవినేని ఉమ మహేశ్వర రావు, రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాస రెడ్డి, కొండా రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బలరామి రెడ్డి, కురుబ హనుమంతు, పాటిల్ మోహన్ రెడ్డి, లాలేప్ప తదితరులు పాల్గొన్నారు.





## 9న అన్నదాత పోరు
# కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ



**పామిడి –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తారీఖున జరగబోయే అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ గుంతకల్ నియోజ కవర్గం మాజీ శాసనసభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వై.వెంకటరామ రెడ్డి చేతుల మీదుగా ఆది వారం వైవిఆర్ క్యాంప్ ఆఫీస్‌లో పోస్టర్ ఆవిష్కరణ జరుగును. కావున గుంతకల్ మండల, పట్టణ ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ ఛైర్ పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌లు, కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జీలు గ్రామాలలోని నాయకులు, సర్పంచులు, వార్డు మెంబర్లు నాయకులు ,అనుబంధ సంఘాల నాయకులు ,కార్యకర్తలు, రైతులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుకుంటున్నాను.

# డాక్టర్.యస్.కృష్ణ ప్రసాద్‌కు సన్మానం




**గుత్తి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6 :**గుత్తి పట్టణంలో అనంతపురం రోడ్‌లో ఉన్న కనిస్క్ హెల్త్ కేర్ సెంటర్ డాక్టర్ యస్.కృష్ణ ప్రసాద్‌ని పెన్షనర్స్ అసోసియేషన్ కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, ఆర్. టి.సి.విశ్రాంత భీమలింగ,జి.శా మ్యూల్ విశ్రాంత ఏ.ఎస్.డబ్ల్యూ, టి.రామచంద్ర సీనియర్ అసిస్టెం ట్ ఆర్అండ్‌బి మొదలగువారు సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అందర ము కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నాము. మిగతా వారు కూడా డాక్టర్‌ని సన్మానించారు. ఆ సుపత్రి సిబ్బంది కుడా సన్మానిం చారు. డాక్టర్ యస్. కృష్ణ ప్రసాద్ మొదట కర్నూలులో పని చేస్తూ గుత్తి కి వచ్చారు.గుత్తి లో మూడు సంవత్సరాలు సేవలం దించారు. ప్రస్తుతం ప్రమోషన్ పై సివిల్ అసిస్టెంట్ సర్జన్ నుండి డిప్యూటీ సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా చిత్తురు జిల్లా పుంగనూరుకు బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, భీమలిం గ, శామ్యూల్, రామచంద్ర, కంబగిరి మొదలగువారు పాల్గొన్నారు.

## బీఎస్పీ నుంచి
# జనసేలోకి భారీగా చేరికలు




**కదిరి– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** కదిరి నియోజకవర్గం పరిధిలోని పలు వార్డులలోని బీఎస్పీ పార్టీ నుండి భారీగా జనసేన పార్టీలో కదిరి నియోజకవర్గం ఇన్చార్జి బైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో బీఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇర్ఫాన్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మురళి గౌడ్, సమీమ, పుష్ప, సురేష్, రెడప్ప బేగం.అనురాధ.క్రిష్ణ. నసీమా, ఫక్రున్ బి తదితరులు అనంతపురం జిల్లా నాయకులు ఆధ్వర్యంలో పార్టీలో చేరడం జరిగింది.ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన జనసేన జిల్లా అధ్యక్షులు, అహుడ చైర్మన్ టీ.సీ.వరుణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, అతికారి క్రిష్ణ ,సుంకర శ్రీనివాస్, చింతా సురేష్ ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని పవన్ కళ్యాణ్ చేస్తున్న కార్యక్రమాలను గుర్తించిపార్టీలో జాయిన్ అయిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యకర్తలకు ఏ అవసరమొచ్చినా బైరవ ప్రసాద్ తో పాటు మీకు అన్ని విధాల జిల్లా కమిటీ అందుబాటులో ఉంటయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ పి కుంట మండల కన్వీనర్ మేకలచెరువు చౌదరి, గాండ్లపెంట మండల కన్వీనర్ రవీంద్రనాయక్ , అనురాధ,జనసేన పార్టీ నాయకులు అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



## మీ కోసం కాల్ సెంటర్
# 1100 సేవలను వినియోగించుకోండి

- ఈనెల 08వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ
- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 06 :–** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసు కోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

**– ఈనెల 08వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ:** ఈనెల 08వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కర్నూలు జిల్లా పోలీసు శాఖకు
# నూతన జాగిలం హంటర్

- నూతన హంటర్ జాగిలాన్ని పరిశీలించిన...జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్
- మంగళగిరి పోలీసు హెడ్ క్వార్టర్స్ నుండి జిల్లా కు చేరుకున్న కొత్త డాగ్
- పేలుడు పదార్థాలు గుర్తించడం లో శిక్షణ.

**కర్నూలు క్రైం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 6:** కేసుల చేధనలో, నేరస్థులను గుర్తించడంలో జిల్లా పోలీస్ శాఖ మరింత బలోపేతం అయ్యేందుకు నూతన జాగిలం హంటర్ జిల్లా పోలీసు శాఖకు రావడం జరిగిందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.హంటర్ అనే నూతన జాగిలం ఎపి విజయవాడ మంగళగిరి హెడ్ క్వార్టర్స్ 6 వ బెటాలియన్ లో 10 నెలల పాటు పేలుడు పదార్థాలు గుర్తిం చడంలో శిక్షణ పొందిందన్నారు.ఈ సంధర్భంగా శనివారం జిల్లా పోలీసు కార్యాల యానికి వచ్చిన నూతన జాగిలాం హంటర్‌ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు.డాగ్ స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.కేసుల ఛేదనలో కీలక మైన జాగిలాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ద వహించాలన్నారు.డాగ్ స్క్వాడ్ మరింత సమర్ధవంతంగా విధులు నిర్వర్తించేందుకు దోహదపడుతుందన్నారు.ఈ జాగిలంతో మొత్తం డాగ్ స్క్వాడ్ సంఖ్య9కి చేరుకుందన్నారు.హంటర్ అనే జాగిలం బెల్జియం మలనాయిస్ జాతికి చెందినదన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ జావేద్, డాగ్ స్వాడ్ ఇంచార్జ్ ఎఆర్ కానిస్టేబుల్ రాజు, డాగ్ హ్యాండ్లర్ ఎఆర్ కానిస్టేబుల్ శేఖర్ పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )